ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

శుక్రవారం 13 జూన్ 2025

****

చికెన్ ధరలు	
లైవ్	124
డ్రెస్	184
స్కిన్‌లెస్	210
గుడ్డుడజన్	72
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	37.0
కనిష్ఠం	22.4

అంగన్‌వాడీల్లోనూ గంట కొట్టాల్సిందే

సీడీపీవోలకు ప్రిన్సిపల్ సెక్రటరీ మౌఖిక ఆదేశాలు

తొలిరోజు నార్కట్‌పల్లిలో ప్రారంభించిన కలెక్టర్ త్రిపాఠి

6

● స్వాగతం.. సుస్వాగతం



జిల్లా వ్యాప్తంగా గురువారం పాఠశాలలు తెరుచుకున్నాయి. నిడమనూరు ప్రాథమిక పాఠశాలను ఉపాధ్యాయులు మామిడి తోరణాలు, పూలతో అలంకరించి విద్యార్థులకు స్వాగతం పలికారు.

8

● ఇక్కత్ కళ అద్భుతం



పోచంపల్లిలో చేనేత వస్త్రాలు, జాతీయ జెండాను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

చేనేత అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ఇక్కడి పథకాలు ఉత్తరాదిలో అమలు చేసేందుకు కేంద్రంతో మాట్లాడతా
- కార్మికుల జీవన ప్రమాణాలు పెంపొందాలి
- అంతా చేనేతను ఆదరించాలి
- ఇక్కత్ డిజైన్ల చౌర్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా
- భూదాన్‌పోచంపల్లిలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

భూదాన్‌పోచంపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు పెరిగేందుకు, కార్మికుల అభ్యున్నతికి ప్రభుత్వం చేపట్టే పథకాలు ఉత్తర భారత రాష్ట్రాల్లోనూ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతానని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. భూదాన్‌పోచంపల్లి పట్టణంలో గవర్నర్ గురువారం పర్యటించి పట్టణంలోని చేనేత కార్మికులు భారత మధు, భారత భాస్కర్ ఇళ్లను సందర్శించి వారి జీవన తీరు తెన్నులను పరిశీలించారు. చేనేత మగ్గంపై వస్త్ర తయారీ ప్రక్రియలను పరిశీలించారు. అనంతరం పోచంపల్లి టూరిజం పార్కులో ఏర్పాటు చేసిన మ్యూజియంను పరిశీలించారు. చేనేత వస్త్ర తయారీ ప్రక్రియలు 'లీవ్‌టుక్లాత్' ప్రాసెసింగ్ యూనిట్ సందర్శించి ఏవీని వీక్షించారు. పోచంపల్లి రూరల్ టూరిజం సెంటర్ సందర్శించిన గవర్నర్‌కు చేనేత వస్త్ర ప్రక్రియల గురించి బోడ నవనీత, భారత లవకుమార్, దోర్నాల శేషగిరి, రుద్ర అంజనేయులు వివరించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం గోవర్ధన్‌తో పాటు చేనేత వస్త్ర విక్రయదారులు, అసోసియేషన్ ప్రతినిధులు, చేనేత కార్మికులు, చేనేత కళాకారులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మిగతా 6వ పేజీలో...

భారం మోయలేం!





- బిల్లులు ఇవ్వకపోతే విధులు నిర్వహించలేమంటున్న కార్యదర్శులు
- వానాకాలం పనులు చేయలేమని స్పష్టీకరణ
- భారీగా నిలిచిన బిల్లులతో కష్టమైన నిర్వహణ
- ఉమ్మడి జిల్లాకు నిలిచిన రూ.692.94కోట్ల ఆర్థిక సంఘం నిధులు
- డీఎస్ఆర్ యాప్‌పై మంత్రి సీతక్క హామీతో ఆందోళన విరమణ

గ్రామపంచాయతీల నిర్వహణ తలకుమించిన భారమైందని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. ఏడాదిన్నరగా పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో అప్పటి నుంచి కేంద్ర ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచాయి. ఈ నేపథ్యంలో అత్యవసర పనులన్నింటినీ కార్యదర్శులే వీడీసీల ద్వారా లేదా నామినేటెడ్ ఏజన్సీల ద్వారా చేయిస్తున్నారు. ట్రాక్టర్ల నిర్వహణకు డీజిల్ కొనుగోలు సైతం కార్యదర్శులే చేస్తున్నారు. దీంతో వారిపై మోయలేని భారం పడుతోంది.

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలనవచ్చాక నిధుల రాకడ నిలిచింది. అత్యవసరమైన తాగునీటిసరఫరా వంటి పనులకు ప్రత్యేక నిధులు మంజూరవుతున్నా, ఇతర పనులకు సంబంధించిన బిల్లులు భారీగా పేరుకుపోవడంతో పంచాయతీల నిర్వహణ భారంగా మారిందని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. ట్రాక్టర్ల నిర్వహణ తమవల్లకాదంటూ తాళాలను ఎంపీడీవో కార్యాలయాల్లో అప్పగిస్తున్న పరిస్థితి మొదలైంది. ఉమ్మడి జిల్లాలో 1,740 పంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొనగా, వర్షాకాలం సీజన్‌లో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ఇబ్బంది కలుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

చేతులెత్తేసిన కార్యదర్శులు

గ్రామపంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో అత్యవసర పనులను కార్యదర్శులు వీడీసీల ద్వారా చేయించారు. ప్రధానంగా తాగునీటి మోటర్ల మరమ్మతులు, పైప్‌లైన్ల ఏర్పాటు, వీధిదీపాల ఏర్పాటు, బ్లీచింగ్, శానిటేషన్ మెటీరియల్, ఫాగింగ్ లిక్విడ్ కొనుగోళ్లతో పాటు, ట్రాక్టర్లకు డీజిల్ సరఫరా బాధ్యత వీరిపైనే పడింది. ప్రత్యేకాధికారుల పాలన అమలులోకి వచ్చినప్పటి నుంచి ఏడాదిన్నరగా కార్యదర్శులే ఈ పనులు చేయిస్తున్నారు. అందుకు సంబంధించిన బిల్లులను గత ఏడాది జూలై వరకు ఒక దఫా, ఆ తర్వాత ఇటీవల మరో మూడు మాసాలకు సంబంధించిన కొంతమేర బిల్లులు మంజూరయ్యాయి. సుమారు ఏడాదికాలానికి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కార్యదర్శులకు వడ్డీల భారంతో పాటు, వీడీసీలు సైతం పనులు చేయకుండా పాత బిల్లుల కోసం ఒత్తిడి తెస్తున్నారు. పంచాయతీ ట్రాక్టర్లకు డీజిల్ సరఫరా చేసే పెట్రోల్ బంక్‌ల నిర్వాహకులు డీజిల్ ఇవ్వడం ఆపేశారు. దీంతో ట్రాక్టర్ల నిర్వహణ పూర్తిగా భారమైందని కార్యదర్శులు చెబుతున్నారు.

నిలిచిన కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధులు

ఉమ్మడి జిల్లాలో కేంద్ర 15వ ఆర్థిక సంఘం నుంచి నల్లగొండ జిల్లాకు ప్రతీ మూడు నెలలకు రూ.19.50కోట్లు వస్తే, యాదాద్రి జిల్లాకు రూ.11.24కోట్లు, సూర్యాపేట జిల్లాకు రూ.13.25కోట్ల నిధులు వచ్చేవి. ప్రత్యేకాధికారుల పాలన వచ్చాక రెండు పర్యాయాలు ఈ నిధులు మంజూరైనా, అవి పాలకవర్గాల హయాంలో చేపట్టిన మిగతా 6వ పేజీలో...

● భారీగా పెండింగ్ బిల్లులు

ప్రత్యేకాధికారుల పాలన వచ్చిన 18 నెలల నుంచి వేసవిలో చేపట్టిన ప్రత్యేక పనులకు సంబంధించిన నిధులు మినహా ఇతర పనుల బిల్లులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శులు ట్రాక్టర్ల నిర్వహణ నిమిత్తం డీజిల్‌ను పంచాయతీ పేరున ప్రైవేట్ పెట్రోల్ బంకుల్లో అప్పుగా పోయించారు. ఈ బిల్లులు పేరుకుపోవడంతో అప్పు పెరగ్గా, ఖాతాలు నిలిపివేయడంతో నిర్వహణ కుంటుపడింది. నల్లగొండ జిల్లాలో సుమారు రూ.35.40 కోట్లు, సూర్యాపేట జిల్లాలో రూ.31.30కోట్లు, యాదాద్రి జిల్లాలో రూ.19కోట్ల మేర పెండింగ్ బిల్లులు ఉన్నట్లు సమాచారం. కొన్ని పెద్ద పంచాయతీల్లో ఇంటిపన్నులు ఇతరత్రా స్థానిక వనరుల ద్వారా కొంత మేర గ్రాంట్లకు చెక్కులు మంజూరైనా అవి ట్రెజరీల్లో పాసవడం లేదని, దీంతో పెండింగ్ బిల్లుల మొత్తం భారీగా పెరుగుతోందని కార్యదర్శులు చెబుతున్నారు. గ్రాంట్లు మంజూరు చేయకపోతే వర్షాకాలంలో పంచాయతీల నిర్వహణ దుర్భరంగా ఉంటుందని, ప్రభుత్వం చొరవ తీసుకొని గ్రాంట్లు మంజూరు చేసి వానాకాలంలో బ్లీచింగ్, పారిశుధ్య పనులు సత్వరమే చేపట్టేందుకు సహకరించాలని కార్యదర్శులు కోరుతున్నారు.



● రైతు భరోసా

భూభారతి ఆధారంగా..

- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- రైతుల వివరాలు, ఖాతా నెంబర్లు పంపించాలని ఆదేశాలు
- ఆన్‌లైన్‌లో నమోదు కాని వివరాలు తిరిగి నమోదు
- ఈ నెల 5 వరకు పాస్‌బుక్ పొందిన వారికి సైతం సాయం
- ఉమ్మడి జిల్లాలో 11.56లక్షల మంది పట్టాదారులు
- పూర్తి సమాచారం పంపేందుకు వ్యవసాయశాఖ సన్నద్ధం

నల్లగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం భూభారతి పోర్టల్‌లో నమోదైన భూ విస్తీర్ణం, రైతుల వివరాల ఆధారంగానే రైతుభరోసా అందజేసేందుకు నిర్ణయించింది. వ్యవసాయయోగ్యం కాని భూములకు రైతుభరోసా పథకం వర్తించని విషయం తెలిసిందే. తాజాగా, ప్రభుత్వం రైతుభరోసాకు సంబంధించి మార్గదర్శకాలను, విధివిధానాలను వెల్లడించింది. వానాకాలం సీజన్‌లో రైతుభరోసాను ఎకరానికి రూ.6వేల చొప్పున ఏడాదికి రూ.12వేలు చెల్లించనుంది. అయితే ఎన్ని ఎకరాల వరకు రైతుభరోసా చెల్లిస్తామనే దానిపై ప్రభుత్వం వివరాలు వెల్లడించలేదు.

వానాకాలం సీజన్‌లో రైతులకు పెట్టుబడి సాయం ఎలా అందించాలి? గతంలో ఉన్న పొరపాట్లను ఎలా సరిదిద్దాలి? అనే అంశంపై రైతుల వివరాలు, ఖాతా నెంబర్లు తిరిగి పంపించాలని సూచిస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. పట్టాదారుల డేటాను సవివరంగా పంపేలా చూడాలని స్పష్టం చేసింది. ఆర్‌బీఐ డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ప్లాట్‌ఫాం మిగతా 7వ పేజీలో...

సాగర్ క్రస్ట్ గేట్ల ట్రయల్ రన్

● రూ.10లక్షలతో క్రస్ట్ గేట్లకు మరమ్మతులు పూర్తి 7

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



నల్లగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా దళిత సంక్షేమం, ఎస్సీ, మైనార్టీ సంక్షేమశాఖల మంత్రి అడ్లూరు లక్ష్మణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కే.రామకృష్ణారావు జీవో నెం.133 విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి దాదాపు ఏడాదిన్నరపాటు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరించగా, తాజా మార్పులు, చేర్పుల నేపథ్యంలో ఆయన్ను కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించారు. కొత్తగా మంత్రి పదవి చేపట్టిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను నల్లగొండకు నియమించారు. ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులను, అధికారయంత్రాంగాన్ని సమన్వయం చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిపనులపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి, సక్రమంగా అమలయ్యేలా ఇన్‌చార్జి మంత్రులు బాధ్యత వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోన్న ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్‌యువవికాసం లబ్ధిదారుల ఎంపికలో వీరి పాత్ర క్రియాశీలకంగా ఉంటుంది. తొలిసారి మంత్రి అయిన లక్ష్మణ్‌కుమార్ కీలకమైన నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులవడం విశేషం.

రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి వద్దు

- కాంగ్రెస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి



నల్లగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తాను నిత్యం నల్లగొండ ప్రజలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు అందుబాటులో ఉండే వ్యక్తినని, తనకు రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి ఇస్తే న్యాయం చేయలేనని, అవకాశం ఉంటే డీసీసీ అధ్యక్ష పదవిని ఇవ్వాలని కాంగ్రెస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి ఇస్తే అందరిని కలుపుకొని పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని అన్నారు. పదవి ఉన్నా, లేకున్నా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నాయకత్వంలో పనిచేస్తానన్నారు. కొంతమంది కావాలని సోషల్ మీడియాలో తాను కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రచారం చేయడాన్ని ఖండించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గుమ్ముల ఏళ్లుగా పార్టీ బలోపేతం కోసం కృషి చేశారని, ఆయనకు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వడం సమంజసమన్నారు. సమావేశంలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కత్తుల కోటి, జూలకంటి వెంకట్‌రెడ్డి, మామిడి కార్తీక్, గాలి నాగరాజు, జూలకంటి శ్రీనివాస్, జహంగీర్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం గర్వించేలా అభివృద్ధి

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎంపీ ఈటల రాజేందర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్, పాల్గొన్న నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనలో దేశం 11 ఏళ్లలో అనేక రంగాల్లో అసాధారణ పురోగతి సాధించిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు పద్మానగర్‌లో చేనేత కార్మికులతో మాట్లాడి హనుమాన్‌నగర్ దేవాలయం వద్ద మొక్కు నాటారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన 11 ఏళ్ల సుపరిపాలన ఛాయాచిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వంపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదని, ఇది దేశ ప్రజల నమ్మకానికి నిదర్శనమన్నారు. రైతులు, యువత, మహిళలు ఈ నాలుగు ప్రధాన విభాగాల అభివృద్ధి కోసమే ప్రతీ కార్యక్రమ రూపకల్పన చేశారని అన్నారు. పన్నుల వ్యవస్థలో సమగ్ర మార్పులు చేసి, జీఎస్టీ ద్వారా వన్ నేషన్ వన్ ట్యాక్స్ లక్ష్యాన్ని సాధించామన్నారు. 2014లో 6.91 కోట్ల మంది పన్నులు కట్టే వారు ఉండగా, ఇప్పుడు 15.66 కోట్లకు పెరిగారని వివరించారు. ఇలా అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి చెందుతోందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, నాయకులు సునీతారెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, పిల్లి రామరాజు, పల్లెబోయిన శ్యామ్ సుందర్, వీరెల్లి చంద్రశేఖర్, కన్మంత రెడ్డి శ్రీదేవిరెడ్డి, కంకణాల నివేదితరెడ్డి, దోనూర్ వీరారెడ్డి, పోతేపాక లింగస్వామి, పాలకూరి రవిగౌడ్, కర్నాటి సురేష్, లాలునాయక్, చింతా ముత్యాల్‌రావు, కొండేటి సరిత, లకడపురం వెంకటేశ్వర్లు, రావెల కాశమ్మ, తదితరులు పాల్గొన్నారు.

● ఈటలకు నార్కట్‌పల్లిలో ఘన స్వాగతం

నార్కట్‌పల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో జరిగిన పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు మార్గమధ్యలో నార్కట్‌పల్లి వద్ద బీజేపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈటలకు స్వాగతం పలికిన వారిలో బీజేవైఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పజ్జూరి వెంకట్‌రెడ్డి, పాల్వాయి భాస్కర్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్, కొరివి శంకర్, నడింపల్లి శ్రవణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక ఆదాయం : అనంతరెడ్డి



ఆయిల్‌పాం మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అనంతరెడ్డి

గుర్రంపోడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పాం సాగుతో సుస్థిరమైన ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి అనంతరెడ్డి అన్నారు. గురువారం గుర్రంపోడు గ్రామంలో రైతు చందా వెంకట్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో మెగా ఆయిల్‌పాం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ప్రభుత్వం అందించే డ్రిప్ పొంది పెద్దఎత్తున ఆయిల్‌పాం సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఉద్యానవన అధికారి మురళి, ఏవో మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు షేక్ సయ్యద్‌మియా, కుప్ప అమరేందర్‌గౌడ్, పగిళ్ల లాలయ్య, రైతులు ఉన్నారు.

భవిత కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు



పెంపుడు శునకాన్ని పిల్లలకు చూపించి, ఏం పేరు పెడదామంటూ సరదాగా దివ్యాంగ విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

గుర్రంపోడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థుల కోసం భవిత కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని భవిత విద్యావనరుల కేంద్రాన్ని ఆమె ప్రారంభించి, విద్యార్థులతో సరదాగా గడిపారు. ఒక్కో విద్యార్థి పేరు అడిగి తెలుసుకున్నారు. రెండు పెంపుడు శునకాలను తెప్పించి పిల్లలు వారితో ఆడుకుంటూ ఉత్సాహంగా ఉండటాన్ని గమనించి ఏం పేరు పెడతారని పిల్లలను ప్రశ్నించారు. మ్యాంగో పేరు పెడుతున్నామని తెలిపారు. ప్రతీవారం భవిత కేంద్రాన్ని సందర్శిస్తానని, ఇక్కడికి వచ్చేప్పుడు పెంపుడు శునకాన్ని తీసుకువస్తానని విద్యార్థులకు తెలిపారు. గుర్రంపోడు భవిత కేంద్రానికి తానే ఇన్‌చార్జినని, కేంద్రానికి విద్యార్థులు వచ్చేట్లు చూడాలని ఐఈఆర్‌పీ శారదకు సూచించారు. అంతకుముందు మోడల్ స్కూల్‌కు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించి పాఠ్యపుస్తకాలు అందజేశారు. కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీచేసి వసతులు బాగున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఏఎమ్మార్పీ డివిజన్ కార్యాలయానికి వెళ్లి నీటిపారుదల శాఖకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోచంపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మంజుల, ఎంఈవో నోముల యాదగిరి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రాగిణి, కేజీబీవీఎస్‌వో విజయశ్రీ, ఆర్‌ఐ నజీర్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి: డీఈవో

హాలియా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డీఈవో భిక్షపతి అన్నారు. గురువారం హాలియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన, క్రమశిక్షణ కలిగిన విద్య అందుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అంతకుముందు అనుముల, హాలియా, కొత్తపల్లి పాఠశాలలను తనిఖీచేశారు. కార్యక్రమంలో ఎంఈవో గుండా కృష్ణమూర్తి, మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, హైమావతి, శైలజ, సైదులు, పాల్గొన్నారు.

విద్యాసంస్థల బస్సులకు
ఫిట్‌నెస్ తప్పనిసరి

● మిర్యాలగూడ ఎంవీఐ ఎల్. వీరస్వామి



పాఠశాలలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులను తీసుకెళ్లేందుకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు బస్సులు ఏర్పా టు చేసుకున్నాయి. ఆ బస్సులు తప్పనిసరిగా ఫిట్‌నెస్ ఉండాలి. బస్సు మెకానికల్, బాడీ సామర్థ్యాన్ని ఎంవీఐ పరీక్షించి నిర్ధారించిన తర్వాతే బస్సులను రోడ్లపై తిప్పాలి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఎంవీఐ పరిధిలో 263 స్కూల్ బస్సులు ఉన్నాయి. గురువారం వరకు 209 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకున్నాయి. గతంలో సామర్థ్యం లేని బస్సులు నడపడం వల్ల ప్రమా దాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. పాఠశాలల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి బస్సుల నిర్వహణపై యాజమాన్యాలకు, డ్రైవర్లకు రవాణాశాఖ అవగాహన కల్పిస్తోంది. బస్సుల ఫిట్‌నెస్‌పై మిర్యాలగూడ ఎంవీఐ వీరస్వామి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

(ఆంధ్రజ్యోతి మిర్యాలగూడ)

ఆంధ్రజ్యోతి: స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌లో ఏలా నిర్ధారిస్తారు?

ఎంవీఐ: తెలంగాణ మోటారు వాహనాల చట్టం- 1989ని అనుసరించి తయారు చేసిన జీవో 35 ప్రకారం బస్సు బహ్య పరికరాలు, విండ్ స్ర్కీన్, వైపర్, లైటింగ్స్ మొదలైన మెకానికల్ కండీషన్‌తో పాటు బస్సు నడపడం వల్ల ఇంజన్ శబ్దాలు, బ్రేకల పని తీరును చూసి ఫిట్‌నెస్‌ను నిర్ధారిస్తాం. కొత్త వాహనాలకు రెండు సంవత్సరాల వరకు ఫిట్‌నెస్ వర్తిస్తుంది. మే 15వ తేదీ నాటికి ప్రతి విద్యాసంస్థ ఫిట్‌నెస్ వ్యాలిడిటీ ముగుస్తున్నందున అన్ని బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది.

ఆంధ్రజ్యోతి : స్కూల్ బస్సుల్లో ఎలాంటి ఏర్పాట్లు ఉండాలి?

ఎంవీఐ : ప్రతి బస్సుకు అత్యవసర ద్వారంతో పాటు దానిపై 'అత్యవసర ద్వారం' అని స్పష్టంగా రాయలి. మందులు, పరికరాలతో కూడిన ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలి. వారానికోసారి పాఠశాల ప్రిన్సిపాల్ ఫస్ట్‌ఎయిడ్ బాక్స్‌ను పరిశీలించాలి. బస్సు డ్రైవర్, అటెండర్ విధిగా యూనిఫామ్ ధరించాలి. బస్సు ఇంజన్ కంపార్ట్‌మెంట్‌లో అగ్నిమాపక యంత్రం పొడి అందుబాటులో ఉంచాలి. వాహనానికి నాలుగు వైపులా బయటివైపు పసుపుపచ్చని రంగుల ఫ్లాషింగ్ లైట్లు అమర్చాలి. విద్యార్థులు దిగేటప్పుడు, ఎక్కేటప్పుడు ఈ లైట్లను వెలిగించాలి. విద్యార్థుల బ్యాగులు పెట్టుకునేందుకు సీట్ల కింద ఏర్పాట్లు చేయాలి. బస్సు తలుపులు సురక్షిత లాకింగ్ సిస్టమ్‌తో పనిచేయాలి. సైడ్ కిటికీల మధ్య 31 సెంటీమీటర్లకు మించని దూరంలో అడ్డంగా మూడు లోహపు కడ్డీలు అమర్చి ఉండాలి. బస్సుల్లో నుంచి విద్యార్థులు దిగేటప్పుడు, ఎక్కేట ప్పుడు స్పష్టంగా కన్పించేలా కుంభాకార అద్దాలు అమర్చుకోవాలి.

ఆంధ్రజ్యోతి: బస్సుల నిర్వహణపై అవగాహన ఎలా కల్పిస్తున్నారు?

ఎంవీఐ : వాహనాల భద్రతపై స్కూల్ యాజమాన్యాలకు అవగాహన అవసరం. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఇంటి నుంచి విద్యాసంస్థకు, సంస్థనుంచి ఇం టికి వాహనాల్లో సురక్షితంగా చేర్చేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెం పొందించేందుకు, బస్సు ఫిట్‌నెస్‌కు ఏమేమి అవసరమో వాటిని కరపత్రం రూపంలో ముద్రించి స్కూల్ యాజమాన్యాలకు అందజేశాం. బస్సులపై విద్యాసంస్థల పేరు, మొబైల్ నెంబర్‌లను ఎడమవైపున ముందుభాగంలో ముద్రించి 60 సంవత్సరాల వయసు లోబడి డ్రైవర్‌ను నియమించుకోవాలని సూచించాం.

ఆంధ్రజ్యోతి: ఫిట్‌నెస్ లేని బస్సులు నడిపే ఎలాంటి చర్యలు తీసుకుంటారు ?

ఎంవీఐ: ఫిట్‌నెస్‌లేని బస్సులను రోడ్లపెక్కి రాకుండా ప్రత్యేక డ్రైవ్ చేపడతాం. పట్టుబడిన బస్సులకు మొదటిసారి భారీగా జరిమానా విధిస్తాం. వెంటనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందేలా వివరిస్తాం. రెండోసారి ఫిట్‌నెస్ లేకుండా బస్సులు పట్టుబడితే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేస్తాం. గడువు తీరిన బస్సులను స్ర్కాప్‌కు వేసేటప్పుడు ఎంవీఐల అనుమతి తీసుకోవాలి. 15 ఏళ్లు పూర్తయిన బస్సులను నిలిపివేసి అధికారులకు సమాచారం ఇవ్వాలి.

చేనేత అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

(5వ పేజీ తరువాయి)

పోచంపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో డిజిటలైజేషన్ కోసం రూ.10లక్షల వరకు మంజూరు చేయాలని, రాష్ట్ర చేనేత నాయకులు తడక వెంకటేష్ గవర్నర్‌ను కోరారు. అందుకు గవర్నర్ స్పందించి వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాల డిజిటలైజేషన్ కోసం రూ.10లక్షలు మంజూరు చేశారు. పనులను త్వరలో పూర్తిచేయించాలని జాయింట్ సెక్రటరీ భవానీ శంకర్‌ను గవర్నర్ ఆదేశించారు. అనంతరం చేనేత బీమా, త్రిఫ్ట్ స్కీం లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ, చేనేత కార్మికుల స్థితిగతులు మార్చడానికి ఐఐటీ, ఎన్ఐఈటీ (నీట్) సంస్థలతో మాట్లాడి ఇక్కడ పర్యటించేలా ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. వారితో మార్కెటింగ్, ప్రొడక్షన్ పెంచేలా తోడ్పడతానని అన్నారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు ప్రవేశపెట్టిన పథకాలు ఉత్తర భారతదేశంలోని రాష్ట్రాల్లో అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి చొరవ తీసుకుంటానని తెలిపారు. మార్కెట్లో ఎక్కువ డిమాండ్



పోచంపల్లిలో చేనేత వస్త్ర తయారీ ప్రక్రియను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

ఉన్న వాటికి నకిలీల బెడద ఉంటుందన్నారు. పోచంపల్లి చేనేత ఇక్కత్ వస్త్రాలకు జీఐఏ (పేటెంట్ హక్కులు) ఉన్నాయని, అయితే డిమాండ్ దృష్ట్యా వాటిని ఇతర సంస్థలు డూప్లికేషన్ చేస్తున్నాయని అన్నారు. డూప్లికేషన్ కాకుండా తగు చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలకు నివేదిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటిలో పోచంపల్లి చీర ఉండాలని, అప్పుడే కార్మికులకు ఉపాధి కలుగుతుందన్నారు. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం కల్పించేందుకు ప్రభుత్వం 'మిస్ వరల్డ్-2025' కాంటెస్టెంట్స్‌ను పోచంపల్లికి రప్పించి ఇక్కత్‌కు ప్రాచుర్యం కల్పించిందన్నారు. రానున్న రోజుల్లో ఆయా దేశాల్లో ఇక్కత్‌కు బ్రాండ్ ఇమేజ్ తెచ్చేలా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వంతో చర్చిస్తానని అన్నారు. చేనేత అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టికి తెస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట చేనేత జౌళిశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కలెక్టర్ హనుమంతరావు, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, డీసీపీ అక్షాంశ్‌యాదవ్, చేనేత, జౌళిశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రావు, ఇందుమతి, డిప్యూటీ డైరెక్టర్ నాగలత, ఆర్‌డీడీ పద్మ, డీఎంవో కళింగరెడ్డి, ఏడీ శ్రీనివాస్‌రావు, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, ఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, చేనేత నాయకులు తడక వెంకటేష్, తడక రమేష్, భారత లవ కుమార్, కాంగ్రెస్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, పాక మల్లేష్‌యాదవ్, లవ కుమార్, ముసుకూరి నర్సింహ పాల్గొన్నారు.

చేనేత కార్మికులతో గవర్నర్ ముఖాముఖి

భూదాన్‌పోచంపల్లి పర్యాటక కేంద్రంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో చేనేత కళాకారులు, కార్మికులు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలతో ముఖాముఖి నిర్వహించారు.



చేనేత కార్మికులతో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

చిటికీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నా

భూదాన్‌పోచంపల్లి పట్టణంలో చేనేత రంగంలో మగ్గం పనితోపాటు చిటికి కట్టి కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వం చేనేత కార్మికులకు చేయూత నిస్తుంది. త్రిఫ్ట్ స్కీం అందరికీ ఉపయోగపడుతుంది.

గుర్రం హేమలత, భూదాన్‌పోచంపల్లి.

నా భర్త చనిపోయినా.. గత ప్రభుత్వం ఆదుకోలేదు

భూదాన్‌పోచంపల్లిలో చేనేత వృత్తిపై ఆధారపడి మా కుటుంబం జీవిస్తోంది. ఎనిమిదేళ్ల ఏళ్ల క్రితం నా భర్త చనిపోయాడు. కనీసం చావు ఖర్చులు కూడా లేవు. స్థానిక నాయకులు తడక వెంకటేష్ ఖర్చులు ఇచ్చి ఆదుకుండు. చేనేత బీమా రూ.5లక్షలు కల్పిస్తున్న నేటి కాంగ్రెస్ సర్కారుకు కృతజ్ఞతలు. చేనేతకు అన్ని విధాలా చేయూత నిస్తోంది. జీఐ ట్యాగ్ ప్రక్రియ నిరంతరం కొనసాగించాలి.

● మెరుగు శశికళ, చేనేత కార్మికురాలు

చేనేతకు మార్కెటింగ్ వసతి కల్పించాలి

చేనేత వస్త్ర వ్యాపరులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. ఉత్పత్తిఅయిన వస్త్రాలు అమ్మకాలు సాగించేట్లు చూడాలి. పోచంపల్లి ఇక్కత్ డిజైన్లను కాపీ కొడుతున్న పవర్‌లూం యజమానులపై చర్యలు తీసుకోవాలి. ఇక్కత్‌కు జీఐఏ (పేటెంట్ హక్కు లు) ఉన్నాయి. వీటిని పరిరక్షించాలి. పోచంపల్లిలో యారన్ డిపో ఏర్పాటు చేసి కార్మికులకు సబ్సిడీపై యారన్ అందించాలని కోరుతున్నాం. .

● తడక రమేష్, చేనేత వ్యాపారి

ఐసీసీఐ లోంబార్డు ఆరోగ్య పథకం అమలుచేయాలి

భూదాన్‌పోచంపల్లిలో చేనేతపై ఆధారపడి జీవిస్తున్నాము. చిన్నప్పుడే నా భర్త చనిపోయాడు. పిల్లలను అతి భారంగా పెంచాను. చిటికి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నమాకు ఐసీఐసీఐ లో బార్డు హెల్త్‌కార్డులు మంజూరు చేసి హెల్త్‌స్కీం అమలు చేయాలి.

● భారత గగన, చేనేత కార్మికురాలు

చేనేత కళాకారులను ప్రత్యేకంగా గుర్తించాలి

చేనేత కళ అనేది సంప్రదాయంగా వచ్చిన అద్భుతమైనది. తండ్రి పర్యవేక్షణలో కొడుకు వృత్తిని కొనసాగిస్తున్నాడు. ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం లేకున్నా అనుభవంతో వస్త్ర తయారీ చేస్తున్నారు. ఉత్పత్తి చేసిన వస్త్రాలను ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయాలి.

గజం అంజయ్య, గజం గోవర్ధన్ (పద్మశ్రీ అవార్డు గ్రహీతలు)

భారం మోయలేం!

(5వ పేజీ తరువాయి)

పనులకు సంబంధించిన పెండింగ్ నిధులు. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలనవచ్చిన 18 నెలలకు సంబంధించి కేంద్ర ఆర్థిక సంఘం నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు 30 నెలలకుపైగా రావాల్సి ఉందని కార్యదర్శులు చెబుతున్నారు. మొత్తంగా మూడు జిల్లాలకు సంబంధించి రూ.692.94కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. నల్లగొండ జిల్లాకు రూ.312కోట్లు, యాదాద్రి జిల్లాకు రూ.179.44కోట్లు, సూర్యాపేటకు సంబంధించి రూ.211.50కోట్ల నిధులు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నుంచి నిలిచాయి.

నల్లగొండ జిల్లాలో పెండింగ్ బిల్లుల తీరిదీ

● ఉమ్మడి జిల్లాలో ఏ పంచాయతీని పరిశీలించినా పెండింగ్ బిల్లుల భారం భారీగా ఉంది. 10,600 జనాభా ఉన్న నార్కట్‌పల్లి మేజర్ గ్రామపంచాయతీకి కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నుంచి ఏటా రూ.78లక్షల వరకు వచ్చేవి. ప్రస్తుతం అవన్నీ నిలిచాయి. దీంతో ఈ పంచాయతీలో 18 నెలల నుంచి ట్రాక్టర్ డీజిల్ మొదలు ఇతర అత్యవసర పనులకు సుమారు రూ.15.40లక్షల మేర వీడీసీల ద్వారా, నామినేటెడ్ ఏజెన్సీల ద్వారా పనులు చేయించగా, ఈ బిల్లుల కోసం కార్యదర్శిపై ఒత్తిడి పెరిగింది.

● తిరుమలగిరి సాగర్ మండలం తిరుమలగిరి మేజర్ పంచాయతీకి కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధులు ఏటా రూ.54లక్షలు వస్తాయి. పాలకవర్గాలు లేక ఈ నిధులు రావడం లేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు మూడేళ్లుగా నిలిచాయి. పంచాయతీలో ట్రాక్టర్ డీజిల్‌కే నెలకు సుమారు రూ.14వేల వరకు ఖర్చవుతోందని, ఇతరత్రా పనులకు కలిపి ప్రత్యేకాధికారుల పాలన వచ్చాక రూ.6లక్షల వరకు వెచ్చించగా బిల్లులకోసం ఒత్తిడి వస్తోందని కార్యదర్శి చెబుతున్నారు.

యాదాద్రి జిల్లాలోనూ...

● యాదాద్రి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక పంచాయతీలో సుమారు రూ.4.50లక్షల విలువైన పనులు చేయగా, ఆ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కాంట్రాక్టర్ల ద్వారా చేపట్టిన మరో రూ.10లక్షల బిల్లులు సైతం పెండింగ్ ఉన్నాయి. ఈ పంచాయతీలో ట్రాక్టర్ డీజిల్‌కు నెలకు కనీసం రూ.15వేల వరకు ఖర్చవుతుంది.

● యాదాద్రి జిల్లా భువనగిరి మండలం అనంతారం పంచాయతీలో అత్యవసర పనులు, ట్రాక్టర్ నిర్వహణ నిమిత్తం సుమారు రూ.7లక్షల వ్యయంతో పనులు చేపట్టారు. ఈ నిధులు రాకపోవడంతో ప్రస్తుతం ఇబ్బందికరంగా మారింది. ఈ పంచాయతీకి కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధులు ఏటా రూ.12లక్షలు వచ్చేవి. పెండింగ్ ఉన్న 18 నెలలకు సుమారు రూ.18లక్షల నిధులు లేక నిలిచాయి.

సూర్యాపేట జిల్లాలో...

● సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పంచాయతీకి ప్రతి నెలా కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నుంచి రూ.2.13లక్షల నిధులు వచ్చేవి. పాలకవర్గాలు లేకపోవడంతో 18 నెలలుగా ఈ నిధులు ఆగిపోయాయి. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులైతే మూడేళ్లుగా నిలిచాయి. ఈ పంచాయతీలో ట్రాక్టర్, పారిశుధ్య నిర్వహణ, ఇతర అత్యవసర పనుల నిమిత్తం గడచిన ఏడాదిన్నర కాలంలో దాదాపు రూ.7లక్షలు ఖర్చు చేయగా, రూ.2లక్షల మేర బిల్లులు వచ్చాయి. ఇంకా రూ.5లక్షల పెండింగ్ బిల్లులు రావాల్సి ఉంది. ఈ బిల్లులు చెల్లించకపోతే వానాకాలంలో పంచాయతీ నిర్వహణ కష్టసాధ్యమే.

మంత్రి హామీతో ఆందోళనలకు బ్రేక్

ఓ వైపు పంచాయతీల నిర్వహణలో నానా అవస్థలుపడుతున్న కార్యదర్శులపై ఇటీవల డీఎస్ఆర్ (డైలీ శానిటేషన్ రిపోర్ట్) యాప్‌తో మరింత ఒత్తిడి పెరిగింది. ఈ యాప్ ద్వారా ప్రతిరోజూ పారిశుధ్య నివేదికను ఆన్‌లైన్‌లో పొందుపరచడంతో పాటు, కార్యదర్శులు వారి పంచాయతీలో లోకేషన్‌ను ఫేషియల్ రికగ్నైజేషన్ ద్వారా అప్‌లోడ్ చేసి హాజరు వేయాల్సి ఉంటుంది. ఇప్పటికే పనిభారంతో సతమతమవుతున్న తమకు ఆన్‌లైన్ హాజరు, డీఎస్ఆర్ రిపోర్టు ఇబ్బందికరంగా మారిందని కార్యదర్శుల జేఏసీ సమ్మెకు వెళ్తామని 20రోజుల పాటు ఈ యాప్‌లో నమోదును నిలిపివేశారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కను జేఏసీ నాయకులు కలవగా, ఈ యాప్ నిర్వహణ, ఆన్‌లైన్ హాజరుపై పునరాలోచన చేస్తామని, విధులు నిలపవద్దని ఆమె సూచించారు. దీంతో డీఎస్ఆర్ యాప్‌లో రిపోర్ట్ అప్‌లోడ్ చేస్తున్నామని, సమ్మె ఆలోచన ప్రస్తుతానికి విరమించుకున్నామని కార్యదర్శుల సంఘం నాయకులు తెలిపారు.

గర్భస్థ శిశువు మృతి.. బంధువుల ఆందోళన

నల్లగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రసూతి కోసం వచ్చిన గర్భిణి కడుపులోనే శిశువు మృతిచెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లాకేంద్ర ఆస్పత్రిలో గురువారం జరిగింది. కుటుంబసభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిపల్లి మండలంలోని కేశినేనితండాకు చెందిన జాటావత్ జాన్సీ మొదటి కాన్పు కోసం ఈ నెల 6వ తేదీన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఆమెకు చికిత్స నందిస్తున్న క్రమంలో గురువారం పురిటినొప్పులు రావడంతో పరిశీలించిన డాక్టర్లు స్కానింగ్ చేశారు. పరిశీలించి కడుపులో శిశువు మృతిచెందిందని నిర్ధారించడంతో ఆమెకు అపాయం కలగకుండా మెరుగైన చికిత్స అందిస్తున్నారు. డాక్టర్ల నిర్లక్ష్యంతో కడుపులోని శిశువు మృతిచెందిందని, తల్లి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకొని వారికి నచ్చచెప్పి ఆందోళనను విరమింపజేయించారు.

చికిత్స పొందుతూ గీతకార్మికుడు..

రామన్నపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని జనంపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు నోముల వంశీగౌడ్(25) ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. రెండు రోజుల క్రితం తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారి తాటిచెట్టుపై నుంచి కిందపడి తలకు గాయాలయ్యాయి. వంశీగౌడ్‌ను రామన్నపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేసి, పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ గురువారం మృతిచెందారు.

గుండెపోటుతో కారు డ్రైవర్

వలిగొండ: గుండెపోటులో కారు డ్రైవర్ గురువారం మృతిచెందాడు. ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా శివరాజనగర్ దర్శికి చెందిన బండారి కృష్ణ(40) యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని నాగారం పరిధి పెట్రోల్ బంకు సమీపంలో కారు డ్రైవర్ సీటులో కూర్చొని మృతిచెందాడు. అతని మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవు. గుండెపోటుతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహన్ని రామన్నపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలలో సీసీ కెమెరాలు ధ్వంసం

యాదగిరిగుట్ట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మునిసిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సీసీ కెమరాలు ధ్వంసమయ్యాయి. గురువారం పాఠశాలలు ప్రారంభం కావడంతో సీసీ కెమెరాలు ధ్వంసమైనట్లు ఉపాధ్యాయులు గుర్తించారు. మైదానంలో వేసవి ఆటలు ఆడుతున్న సందర్భంలో కొంతమంది ఆకతాయిలు కెమెరాలు ధ్వంసం చేసినట్లు ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఎంఈవో ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. దుండగులను గుర్తించి కేసు నమోదు చేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపారు.

నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లం, పటిక పట్టివేత

డిండి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సారా తయారీకి ముడి సరుకుగా వినియోగించే నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లం, 100కిలోల పటికను నల్లగొండ జిల్లా డిండి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండలకేంద్రంలోని దేవరకొండ చౌరస్తా వద్ద ఆటోలో తరలిస్తున్న 420కిలోల నల్లబెల్లం(14 బస్తాలు), 100కిలోల పటికను హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల మండలం సీబీతండాకు తరలిస్తుండగా పట్టుకున్నారు. ఆటోడ్రైవర్ సబావట్ సురేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పశు వైద్యశాలలో ప్రభుత్వ ఉద్యోగిపై దాడి

హుజూర్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండల పరిధిలోని వేపలసింగారం గ్రామంలోని పశువైద్యశాలలో వెటర్నరి అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ ఖాజామియాపై చిలుకూరుకు చెందిన 20 మంది వ్యక్తులు గురువారం దాడి చేశారు. బాధితుడు ఖాజామియా పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఉదయం 11 గంటల సమయంలో పశువైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న ఖాజామియాపై అకారణంగా అతని సమీప బంధువులు వ్యక్తిగత, కుటుంబ కక్షలను దృష్టిలో పెట్టుకుని దాడి చేసి గాయపర్చినట్లు బాధితుడు తెలిపారు. కాగా ఈ విషయంపై విచారణ చేస్తున్నామని ఏఎస్ఐ రమేష్ తెలిపారు. విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిపై దాడి చేయడం చట్ట రీత్యా నేరమని అధికారులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జరిమానా, జైలు శిక్ష

సూర్యాపేటక్రైం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాకేంద్రంలో గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదురుగు పట్టుబడ్డారు. ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీ.వీ. రమణ ఒకరికి ఒకరోజు జైలు శిక్ష, రూ.1000 జరిమానా, మరో నలుగురికి కలిపి రూ.3500 జరిమానా విధించారు. జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించినట్లు ఎస్ఐ. సాయిరాం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఐదుగురిని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

శుభకార్యానికి వచ్చి మృత్యువాత

అత్మకూర్(ఎస్), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయం వద్ద బంధువుల శుభకార్యానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో నాలుగేళ్ల బాలుడు మృతిచెందాడు. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం తెలువారీగూడెంకు చెందిన గట్టిగొర్ల మహేష్ -శ్రావణి దంపతుల కుమారుడు మోక్షిత్(4)తో గురువారం దండుమైసమ్మ ఆలయం వద్ద బంధువుల పండుగకు వచ్చారు. ఆలయంలో దర్శనం తర్వాత రోడ్డు దాటుతుండగా సూర్యాపేట వైపు నుంచి నెమ్మికల్‌కు వస్తున్న ట్రాక్టర్ మోక్షిత్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.



మోక్షిత్(ఫైల్)

ఆర్టీసీ బస్సు ఢీకొని..

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రానికి శివారులో ఓ హోటల్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మిర్యాలగూడకు చెందిన ఎస్‌కే. అమీర్(24), అతడి స్నేహితుడు సయ్యద్ సోహెల్‌లు కలిసి బక్రీద్ పండుగ రోజు బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్లారు. తిరిగి మిర్యాలగూడకు బైక్‌పై వస్తుండగా అదేదారిలో భద్రాచలం వైపు వెళ్తున్న నిజామాబాద్ డిపో బస్సును నార్కట్‌పల్లి శివారులోని ఓ హోటల్ వైపు డ్రైవర్ అకస్మాత్తుగా మళ్లించాడు. దీంతో బస్సు పక్కగానే వస్తున్న బైక్ నడుపుతున్న ఎస్‌కే అమీర్ బస్సు వెనుక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సోహెల్ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు.



ఎస్‌కే. అమీర్(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గరిడేపల్లి: గేదెను ఢీకొని బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన కోడిరెక్క రవి, కోడిరెక్క వెంకటేశ్‌లు పని నిమిత్తం హుజూర్‌నగర్ బైక్‌పై వెళ్లి పనులు ముగించుకొని తిరిగి శెట్టిపాలెం వెళ్తుండగా రాత్రి 9.15గంటల సమయంలో మండలంలోని అప్పన్నపేట గ్రామ శివారులో గేదెను బైక్ ఢీకొని బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. రవికి స్వల్ప గాయాలు కాగా, వెంకటేశ్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది.

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

త్రిపురారం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలోని కాపువారిగూడెం గ్రామానికి చెందిన పానుగోతు దేవిలాల్ (34) బీటెక్ పూర్తి చేసి పోటీ పరీక్షలకు ప్రిపేరై ఆరు నెలల క్రితం దివ్యాంగుల కోటాలో ఇరిగేషన్ శాఖలో జేఈఈగా ఉద్యోగం సాధించాడు. మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఓ గది అద్దెకు తీసుకొని అక్కడే నివాసముంటున్నాడు. బుధవారం రాత్రి వ్యక్తిగత కారణాలతో జీవితంపై విరక్తిచెంది తాను ఉంటున్న గదిలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన ఇరుగుపొరు గమనించి చికిత్సనిమిత్తం అతనిని వెంటనే హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు బంధువులు పేర్కొన్నారు. దేవిలాల్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.



దేవిలాల్ (ఫైల్)

వేములకొండలో గ్రామపంచాయతీ స్వీపర్

వలిగొండ: కుటుంబ సమస్యల కారణంగా ఎలుకల మందు తాగి గ్రామపంచాయతీ స్వీపర్ ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ యుగేందర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వేములకొండ గ్రామానికి చెందిన కాడిగాళ్ల రాములమ్మ (55) గ్రామపంచాయతీ స్వీపర్ పనిచేస్తోంది. కుటుంబ సమస్యల కారణంగా బుధవారం ఎలుకల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డాక్టర్ సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం భువనగిరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. రాములమ్మ కుమారుడు నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంగన్‌వాడీల్లోనూ గంట కొట్టాల్సిందే

● సీడీపీవోలకు ప్రిన్సిపల్ సెక్రటరీ మౌఖిక ఆదేశాలు ● తొలిరోజు నార్కట్‌పల్లిలో ప్రారంభించిన కలెక్టర్ త్రిపాఠి

నార్కట్‌పల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బడిలోనే కాదు ఇకపై అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ గంట కొట్టాల్సిందే. 50ఏళ్ల క్రితం గడియారాలు అంతగా అందరి ఇళ్లలో లేని సమయంలో పాఠశాలకు వెళ్లే సమయం అయిందనే సంకేతంగా బడిలో(బెల్) గంట మోగించేవారు. పిల్లలు బడికి వెళ్లేందుకు సన్నద్ధమయ్యేవారు. కాలం మారుతుండటంతో వసతుల్లోనూ మార్పులు వచ్చాయి. దీంతో కొన్ని పాఠశాలల్లో మాత్రం ఆధునిక ఏర్పాట్లు చేసుకుని మోగిస్తున్నారు. ఇదీ స్థూలంగా బడిగంటకున్న ప్రత్యేకత. అయితే ఇంత వరకు ఇది ప్రభుత్వ అన్ని పాఠశాలల్లోనూ నిత్యం మోగించడం అందరికీ తెలుసు. కానీ (ప్రీమెట్రిక్ వయసు) చిన్నారులు చేరే అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ 'గంట' కొట్టే మౌఖిక ఆదేశాలందాయి. ఇటీవల శిశు సంక్షేమ శాఖ అధికారులు, సీడీపీవోలతో శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో గంట కొట్టే విధానాన్ని అమలుపర్చాలని మౌఖికంగా ఆదేశాలిచ్చినట్టు ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగానే బుధవారం నార్కట్‌పల్లిలో జరిగిన నూతన చిన్నారుల నమోదు కోసం నిర్వహించిన అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అంగన్‌వాడీ కేంద్రంలోనూ గంట మోగించి ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాలు కూడా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోవనే సందేశాన్ని ఇవ్వడం, కూలి పనుల కోసం ఇంటి నుంచి త్వరగా వెళ్లే తల్లులను దృష్టిలో పెట్టుకుని ఈ విధానాన్ని అమలుపరుస్తున్నట్లు భావిస్తున్నారు. తల్లులు పనిలోకి వెళ్లినా ఇంట్లో ఉండే ఇతరులు అంగన్‌వాడీ కేంద్రంలో వినిపించే గంట శబ్దంతో కేంద్రానికి తీసుకువస్తారనే ఆలోచనతోనే బడిలో మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ గంట మోగించే విధానాన్ని అమలు పరుస్తున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం గంట, తిరిగి సాయంత్రం 4గంటలకు ఇంటికి వెళ్లే సమయంగా ఆయా లేదా అంగన్‌వాడీ టీచర్లో ఎవరైనా గంటను కొట్టనున్నారు. కాగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో కనీస వసతుల కల్పన కోసం కేటాయించిన నిధుల నుంచి గంటలను సమకూర్చుకోవాల్సిందిగా ఆదేశాలున్నట్టు తెలిసింది.



నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి-1 అంగన్‌వాడీ కేంద్రంలో గంట కొట్టే విధానాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ త్రిపాఠి (ఫైల్)

బడిగంట మోగింది..



భువనగిరి బీచ్‌మహల్లా పాఠశాలలో గురువులకు నమస్కరిస్తున్న విద్యార్థులు



రాజాపేట మండలం సింగారంలో పూలతో స్వాగతం పలికిన ఉపాధ్యాయులు



బీబీనగర్ మండలం పెద్దపలుగుతండాలోని విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్తున్న టీచర్లు



నల్లగొండలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు





డిండి మండలం కొత్తతండాలో వ్యవసాయ పనుల్లో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి పిల్లలను పాఠశాలలో చేర్పించాలని అభ్యర్థిస్తున్న ఉపాధ్యాయులు



పాఠశాలలకు వేసవి సెలవులు ముగిశాయి. బడిగంట మోగడంతో గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభమయ్యాయి. విద్యార్థుల రాకతో పాఠశాలల్లో సందడి నెలకొంది. ఇన్నాళ్లు నిర్మానుష్యంగా పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పాఠశాలలను మామిడి తోరణాలు, గేటు వద్ద అరటి, కొబ్బరి మట్టలతో అలంకరించారు. తివాచీ పర్చి ఉపాధ్యాయులు గేటు వద్ద నిల్చొని పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు స్వాగతం పలికారు.

● ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్



ఆత్మకూర్(ఎం) మండలకేంద్రంలో సరస్వతీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అక్షరాభ్యాసంలో పాల్గొన్న విద్యార్థులు



సూర్యాపేటలో విద్యార్థులకు స్వాగతం పలికేందుకు నిల్చున్న ఉపాధ్యాయులు



సూర్యాపేటలో విద్యార్థులకు పూలు ఇచ్చి స్వాగతం పలుకుతున్న టీచర్లు

సాగర్ క్రస్ట్ గేట్ల ట్రయల్ రన్



ట్రయల్ రన్ నిర్వహించిన క్రస్ట్ గేట్లు

● రోప్‌లకు కార్డియం కాంపౌండ్ పూత

నాగార్జునసాగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల మరమ్మతులు పూర్తి కావడంతో గురువారం ట్రయల్ రన్ నిర్వహించారు. క్రస్ట్ గేట్లను ఎత్తడానికి సహాయపడే ఐరన్ రోప్‌లకు కార్డియం కాంపౌండ్ పూతను పూశారు. ప్రతీ సంవత్సరం ఎగువ నుంచి వరదలు వచ్చే నాటికి క్రస్ట్ గేట్లకు మరమ్మతులు నిర్వహించి, రబ్బరు సీళ్లను సరిచేయడం, రోప్‌లకు గ్రీసింగ్ చేయడం, క్రస్ట్ గేట్లను పైకి ఎత్తడానికి ఉపయోగపడే మోటార్లకు సర్వీసింగ్ చేయడం వంటి పనులను ప్రాజెక్టు అధికారులు నిర్వహిస్తారు. దీనిలో భాగంగా 15రోజులుగా సాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల మరమ్మతులు నిర్వహించారు. క్రస్ట్ గేట్లు పైకి ఎత్తడానికి ఉపయోగపడే ఐరన్ రోప్‌లు మోరాయించకుండా(పట్టివేయకుండా) ఉండేందుకు కార్డియం కాంపౌండ్ పూతను పూశారు. అనంతరం ట్రయల్ రన్ నిర్వహించారు. క్రస్ట్ గేట్లను పైకెత్తడంలో ఎటువంటి సమస్యలు లేవని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. క్రస్ట్ గేట్ల మరమ్మతులకు రూ.10 లక్షలు ఖర్చు అయినట్లు అధికారులు పేర్కొన్నారు.



క్రస్ట్ గేటు రోప్‌లకు కార్డియం కాంపౌండ్‌ను పూస్తున్న సిబ్బంది

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్య మనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలి పూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. స్వామివారిని హిమాచల్‌ప్రదేశ్ చీఫ్ సెక్రెటరీ ప్రబోద్ సక్సేన దర్శించుకున్నారు. ఆలయ పూజారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభువులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఏఈవో గజ్వేల్లి రమేష్‌బాబు లడ్డు ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కొండకింద వ్రత మండపాన్ని ఈవో ఎస్. వెంకట్రావ్ పరిశీలించారు. సత్యదేవుని వ్రతాలు నిర్వహించేందుకు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం టికెట్ ధర, భక్తులకు ఏమేమి వస్తు సామాగ్రి ఇస్తున్నారని వ్రత మండపం ఇన్‌చార్జీ చంద్రమౌళిని అడిగి తెలుసుకున్నారు.



సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

వైభవంగా నరసింహ స్వామి కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్య శాశ్వత కల్యాణాన్ని గురువారం అర్చకులు వేదమంత్రోచ్చరణాల నడుమ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచానం, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, అష్టోత్తర సహస్ర కుంకుమార్చనలు, అనంతరం కల్యాణ తంతులో భాగంగా ఎదుర్కోళ్ల మహోత్సవంతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

రైతు భరోసా భూభారతి ఆధారంగా..

(5వ పేజీ తరువాయి)

కుబేర్‌ను ఉపయోగించి రైతుభరోసా సాయాన్ని అందించనుంది. పట్టాదారుల వివరాలు, బ్యాంక్ వివరాల్లో లోపాలు ఉంటే అవసరమైన వాటిని సరిదిద్ది అధికారులు పూర్తిగా ధ్రువీకరించిన తరువాతనే ప్రభుత్వానికి పంపించాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 11,56,800మంది పట్టాదారులు ఉన్నారు.

ఈ నెల 5 వరకు కొత్త పాస్ పుస్తకాలు వచ్చినా..

కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన రైతులకు సైతం రైతుభరోసాను వర్తించనుంది. అందుకు ప్రభుత్వం ఈనెల 5వ తేదీ వరకు కటాఫ్ డేట్‌ను ప్రకటించింది. 5వ తేదీ వరకు పాస్‌బుక్ పొందిన రైతులకు రైతుభరోసా అందుతుంది. యాసంగిలో నాలుగు ఎకరాలలోపు ఉన్న వారికి మాత్రమే రైతుభరోసాను చెల్లించిన ప్రభుత్వం వానాకాలంలో ఏ మేరకు చెల్లిస్తామనే దానిపై ఒక నిర్ణయానికి రాలేదు. గత సీజన్‌లో అంటే 2024-25లో వ్యవసాయశాఖ అధికారులు పంపించిన డేటా రికార్డులను పరిశీలించి అందులో ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తిస్థాయి వివరాలు పంపాలని ప్రభుత్వం కోరింది. ఎంఏవో, ఏడీఏలు, డీఏవోలు పూర్తిస్థాయిలో పరిశీలన చేసి సమగ్రమైన సమాచారాన్ని పంపనున్నారు. ఏఈవోలు సంబంధిత ఖాతా నెంబర్, పట్టాదారునిదేనని నిర్ధారించుకున్న తరువాతనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఏదైనా లోపాలు గమనిస్తే ఏఈవో లాగిన్‌కు తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. ఎంఏవోలు బ్యాంకు ఖాతాలు వివరాలు ధ్రువీకరించిన తరువాత రైతు భరోసా చెల్లించడానికి వీలుంటుంది. వివరాలు పంపించే సమయంలో ప్రధానంగా బ్యాంకు ఖాతాలు, పట్టాదారు పాస్‌పుస్తకం మొదటి పేజీని ఏఈవో ద్వారా పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.


ఉమ్మడి జిల్లాలో పట్టాదారులు, ఇతర వివరాలు ఇలా....

జిల్లా	2024-25 సరైన డేటా	కొత్త పట్టాదారులు	డీబీటీ లోపాలతో భరోసా రాని రైతులు	వివరాలు ఇవ్వని రైతులు	రైతుభరోసా నిలిచిన రైతులు	మొత్తం పట్టాదారులు
నల్లగొండ	5,21,881	9,506	1,774	26,994	5,375	5,65,788
యాదాద్రి	2,51,074	5,091	753	24,584	2,665	2,84,250
సూర్యాపేట	28,442	5,043	903	13,392	2,914	3,06,760
మొత్తం	8,01,397	19,640	3,480	64,970	10,954	11,56,800

రికార్డులను సరిదిద్దడంతో తొలగనున్న సమస్యలు

భూ రికార్డుల్లో గతంలో ఉన్న పలు లోపాలను ప్రభుత్వం సరిదిద్దడం కోసం ప్రత్యేకంగా ఓ ప్రొఫార్మాను రూపొందించి అందులో డేటాను నమోదు చేయాలని అధికారులను ఆదేశించింది. గత ప్రభుత్వం ధరణి పోర్టల్ ఆధారంగా రైతుబంధు సాయం ఇవ్వగా, అప్పట్లో సాగులో లేని భూములకు, గుట్టలకు, వెంచర్లకు కూడా రైతుబంధు ఇచ్చారని ఆరోపణలు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన భూభారతి ఆధారంగా రైతుభరోసా ఇవ్వనుంది. అందుకు పూర్తిస్థాయిలో రికార్డులు సరిదిద్దడం కోసం తాజాగా ఇచ్చిన ఆదేశాల ప్రకారం 2024-25లో ఎంఏవోలు పంపించిన రైతుల వివరాలు, పాత పట్టాదారులకు వివిధ కారణాలతో సాయం అందకుండా పోయిన డేటా, రైతుల సంఖ్య, డీబీటీ పద్ధతిన నగదు జమ కాని నాలుగు సీజన్లలోని పట్టాదారుల వివరాలు, బ్యాంకు ఖాతాల వివరాలను, రైతుల సంఖ్యను పంపించాలని కోరింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారులు సమర్పించిన పత్రాలు సరిగ్గా ఉండేలా క్షేత్రస్థాయి అధికారులు కసరత్తు చేయాల్సి ఉంటుంది. అదే విధంగా రైతు చనిపోతే రైతుబీమా సాయం అందిన వివరాల ప్రకారం వారి ఖాతాలకు రైతుభరోసాను నిలిపివేసేలా చర్యలు తీసుకోనున్నారు. రైతు చనిపోతే అతని పేరున భూమి పట్టామారిన తరువాతనే రైతుభరోసా కుటుంబ సభ్యులకు అందుతుంది.

సమగ్ర వివరాలు ప్రభుత్వానికి అందిస్తాం



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతుల సమగ్ర వివరాలను అందజేస్తాం. వానాకాలం సీజన్‌లో రైతుభరోసాను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం వివరాలు పంపాలని ఆదేశించింది. గతంలో ఉన్న డేటాను ఆధారంగా చేసుకొని కొత్తగా నమోదు చేయాల్సిన వివరాలను సేకరించడం, ఖాతా నెంబర్ల పొరపాట్లను సరిదిద్దడం వంటివి చేస్తాం. గతంలో సాంకేతిక సమస్యలతో సాయం అందని వారు రైతులు వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకురావాలి. కొంతమంది రైతులు ఖాతా నెంబర్లను సరిగ్గా అందజేయకపోతే భరోసా అందడం కష్టమవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ అధికారులు అడిగిన ప్రతి వివరాలను సమగ్రంగా అందించాలి. ఖాతా నెంబర్ తప్పుగా ఉండకుండా చూసుకోవడంతో పాటు అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించి రైతుభరోసాను పొంది వ్యవసాయానికి పెట్టుబడిని ఉపయోగించుకోవాలి.

-పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ జేడీఏ

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.63,09,560

నార్కట్‌పల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించిన నగదు మొత్తం రూ.63,09,560లు లభించినట్లు ఈవో సిరికొండ నవీన్‌కుమార్ తెలిపారు. గుట్టపైన హుండీలు తెరిచి లెక్కించగా రూ.55,13,900లు, గుట్ట కింద పార్వతీ అమ్మవారి ఆలయాల హుండీ కానుకలను లెక్కించగా రూ.7,95,660లు లభించాయన్నారు. అదేవిధంగా నిత్యాన్నదాన నిర్వహణ కోసం భక్తులు విరాళాల రూపంలో రూ.49,512లు అందించినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ డివిజన్ పరిశీలకురాలు సుమతి, దుర్గ శివసాయి సేవా సమితి సభ్యులు, దేవస్థాన, బ్యాంకు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మాస్ మీడియా అధికారిగా తిరుపతిరావు

నల్లగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో మాస్ మీడియా జిల్లా అధికారిగా తిరుపతిరావున్ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతిరావు వైద్య ఆరోగ్యశాఖలో ఇదే విభాగంలో గతంలో పనిచేశారు. తిరుపతిరావు శుక్రవారం నాడు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా తిరుపతిరావుకు పలువురు అభినందనలు తెలిపారు.

మోడల్ స్కూల్‌లో సైన్స్ పోస్టుకు దరఖాస్తులు

శాలిగౌరారం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లాల మోడల్ స్కూల్‌లో 6 నుంచి 8వ తరగతులకు సైన్స్ గంటల ప్రాతిపదికన (హెచ్‌బీటీ) బోధించడానికి ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 16వ వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ కోరారు. అదే రోజున డెమో, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. ఈ పోస్టకు బీఎస్సీ, బీఈడీ, టెట్‌లో ఉత్తీర్ణులై ఉండాలన్నారు.

ఒక్కపోసపై ఒక్కసారి ఆలోచించండి

● వ్యవసాయాధికారి గౌతమ్



వానాకాలం సీజన్ ప్రారంభంతో రైతులు సాగుకు సిద్ధపడుతున్నారు. వర్షాలు కురుస్తుండటంతో నేలను దుక్కి దున్ని విత్తనాలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పంటల సాగులో రైతులను ఎలా సన్నద్ధం చేస్తున్నారు..వారికి కావల్సిన ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాలపై నార్కట్‌పల్లి మండల వ్యవసాయాధికారి గౌతమ్‌తో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

ఇంటర్వ్యూ Interview

(ఆంధ్రజ్యోతి - నార్కట్‌పల్లి)

ఆంధ్రజ్యోతి: వానాకాలం సాగుకు రైతులు సన్నద్ధం అయ్యారా?

ఏవో: నైరుతి ఇప్పటికే పలకరించడంతో రైతులు తమ పొలాలను దుక్కి దున్ని సాగుకు సన్నద్ధమవుతున్నారు.

ఆంధ్రజ్యోతి: నార్కట్‌పల్లి మండలంలో ఎన్ని ఎకరాల్లో పంటల సాగు చేస్తున్నారు.

ఏవో: మండలంలో మొత్తం 42 వేల ఎకరాల్లో పంటల సాగు చేస్తారని అంచనా. వీటిలో 20 వేల ఎకరాల్లో వరిసాగు, 25 వేల ఎకరాల్లో పత్తి పంటను సాగుచేసారని అంచనా వేస్తున్నాం. వీరిలో 8 వేల మంది రైతులు వరి, 8500 మంది రైతులు పత్తిని సాగుచేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని ఎరువుల షాపులు ఉన్నాయి.

ఏవో: మండలంలోని అన్ని గ్రామాల్లో కలిపి మొత్తం 24 ఎరువులు, పురుగు మందుల విక్రయ డీలర్లు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: పత్తి, వరి సాగుకు విత్తనాలు అందుబాటులో ఉన్నాయా?

ఏవో: పత్తి సాగుకు ఎకరాకు 3 ప్యాకెట్ల చొప్పున 30 టన్నుల పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచాం. పచ్చిరొట్ట, కాంప్లెక్స్ ఎరువులు కూడా సరిపడా నిల్వలు ఉన్నాయి. అదేవిధంగా వరిలో కూడా ఎక్కువగా సన్నాల సాగు చేయాలని చెబుతున్నాం.

ఆంధ్రజ్యోతి: ఒక్కపోస వరి వంగడాలపై రైతులకు ఏం చెబుతున్నారు?

ఏవో: ఒక్కపోస వరి సాగు చేస్తే ధాన్యం ఎక్కువ దిగుబడి వస్తుం దేమో కానీ తీసుకునేందుకు మిల్లర్లు అనాసక్తిగా ఉన్నారు. ఒక్కపోసకు బదులుగా దిగుబడి ఎక్కువగా ఇచ్చే వరి వంగడాలు వేయాలని సూచించాం.

ఆంధ్రజ్యోతి: వరిసాగులో రైతులకు మీరిచ్చే సూచన ఏమిటి?

ఏవో: వరిసాగుపై ప్రధానంగా కాండం తొలిచే పురుగు ఆశిస్తుంది. దీని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలను తగిన మోతాదులో వాడాలని సూచించాం. నర్సరీ స్టేజీలోనే అందిస్తే ఫలితం ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: మండలంలో నకిలీ విత్తనాల విక్రయాలు వెలుగుచూశాయా? ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

ఏవో: ఇప్పటి వరకు మండలంలో నకిలీ విత్తనాల విక్రయాల సమాచారం లేదు. ఒకవేళ ఎవరైనా గ్రామాల్లోకి వచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం ఇస్తే వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేస్తాం. డీలర్ల వద్ద కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులకు రైతులు రశీదు తీసుకోవాలి.

మోగిన బడిగంట

● పాఠశాలలు పునఃప్రారంభం ● పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేసిన ఉపాధ్యాయులు



చిట్యాల మండలం చిన్నకాపర్తిలో తొలి రోజు పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

వేసవి సెలవులు ముగియడంతో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభమయ్యాయి. పాఠశాలలను మామిడి తోరణాలు, పూలతో అలంకరించి పండుగ వాతావరణంలో పాఠశాలలను తెరిచారు. విద్యార్థులు సైతం ఉల్లాసంగా పాఠశాలలకు హాజరయ్యారు.

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

నల్లగొండ టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో రాణించాలని పెద్దసూరారం హైస్కూల్ గెజిటెడ్ హెచ్‌ఎం రాధకిషన్ అన్నారు. మండలంలోని పెద్దసూరారం హైస్కూల్‌లో గురువారం పాఠశాల పునః ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు ఉచిత స్కూల్ డ్రెస్‌లు, బుక్స్, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, సరోజినిదేవి, జ్ఞానేశ్వరిచారి, సత్యబాబు, రమేష్, యాదగిరి, సఫియాబేగం పాల్గొన్నారు.



చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

● చిట్యాలరూరల్ : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులు సెలవులకు టాటా చెప్పి బడిబాట పట్టారు.పుస్తకాల బ్యాగులతో బడిబాట పట్టారు. సెలవుల్లో ఆనందంగా గడిపి పాఠశాలకు రావడంతో తోటి స్నేహితులు, ఉపాధ్యాయులు కనబడగానే ఆప్యాయంగా పలకరించారు. పలు పాఠశాలల్లో చేరిన విద్యార్థులను చేర్చుకుని ఉపాధ్యాయులు అడ్మిషన్ పత్రాన్ని అందజేశారు.

● మునుగోడు : మండలంలోని అన్ని పాఠశాలల్లో మామిడి తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తొలిరోజు విద్యార్థులు అధిక సంఖ్యలో రాకతో సందడి నెలకొంది. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను ఎంఈవో మల్లేశం ఆస్కూల్ హెచ్‌ఎం అంజయ్య, ఉపాధ్యాయులు అందజేశారు.

● మర్రిగూడ : పాఠశాలల సెలవులు ముగియడంతో తిరిగి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు రావడంతో ఉపాధ్యాయులు వినూత్నంగా స్వాగతం పలికారు. మండలంలోని దామెర భీమనపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరామ్ ఉపాధ్యాయుల బృందం కలసి పాఠశాల గేట్ నుంచి సరస్వతి విగ్రహం వరకు పచ్చ తోరణాలు కట్టి విద్యార్థులకు స్వాగతం పలికారు.

● నాంపల్లి :ప్రభుత్వ పాఠశాలలోని నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో మల్లికార్జున రావు అన్నారు. గురువారం పెద్దాపురం ఆదర్శ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ పాఠ్యపుస్తకాలను మొదలైన స్టడీ మెటీరియల్స్ ఆ పాఠశాల విద్యార్థులకు అందజేశారు.

● చండూరు రూరల్ : మండలంలోని బంగారిగడ్డ గ్రామంలో ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాధికారి ఊట్కూరి సుధాకర్‌రెడ్డి సందర్శించారు. పాఠశాల పునఃప్రారంభం మొదటిరోజున సిబ్బంది పాఠశాలలను శుభ్రం చేసి పండుగ వాతావరణంలో అలంకరించారు. ఈ సందర్భంగా మొదటిరోజు పాఠశాలకు వస్తున్న విద్యార్థులకు ఆయన పుష్పాలను అందించి పాఠశాలకు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామలింగయ్య, మాదగోని వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

● కనగల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన బోధన లభిస్తుందని ఎంఈఓ పద్మ అన్నారు. మండలంలోని తేలకంటిగూడెం, చినమాదారం, పర్వతగిరి, పగిడిమర్రి, తుర్కపల్లి పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం యూనిఫాం, బుక్స్‌ను ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. చినమాదారం పాఠశాలలో ఎంఈఓ చేతుల మీదుగా దుస్తులు పంపిణీని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ సర్పంచులు గోలినర్సిరెడ్డి, బోగరి రాంబాబు, ఏపీఎం సంకుహరి, సీసీలు వసంత, విజయ, ప్రభాకర్. పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

● కట్టంగూరు : విద్యారంగ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి అన్నారు. పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా కట్టంగూరు పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను గురువారం అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కోటేశ్వర్‌రావు, ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్, మాజీ జడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, నాయకులు రెడ్డిపల్లి సాగర్, గట్టిగొర్ల సత్తయ్య, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఆంథోని, ఉపాధ్యాయులు గఫూర్, శ్రీనివాస్, విజయ్ కుమార్, మహాలక్ష్మి ఉన్నారు.



కనగల్‌లో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ పద్మ

ఇందిరమ్మ ఇళ్ల కొలతలు పక్కాగా ఉండాలి

● హౌసింగ్ పీడీ ఎస్పీ రాజ్‌కుమార్



చిట్యాల మండలం వట్టిమర్తిలో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ ఎస్పీ రాజ్‌కుమార్

చిట్యాల రూరల్, జూన్ 12: ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునే లబ్ధిదారుల ఇళ్ల కొలతలు పక్కాగా ఉండాలని హౌజింగ్ పీడీ ఎస్పీ రాజ్‌కుమార్ అన్నారు. చిట్యాల మండలం వట్టిమర్తిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పైలెట్ ప్రాజెక్టు కావడంతో ఇందిరమ్మ ఇళ్ల కొలతల ఫొటోలు తీయడంపై ఎంపీడీవో, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునే లబ్ధిదారులు ఇళ్ల జీపీఎస్ ఆధారంగా ఫొటోలను జాగ్రత్తగా, పక్కాగా తీయాలని సూచించారు. ఇంటి నిర్మాణానికి సంబంధించిన ఫొటోలను ఒకవేళ పొరపాటుగా కొలతలు ఎక్కువగా వస్తే డబ్బులు రాక లబ్ధిదారులు ఇబ్బంది పడతారన్నారు. ఇంటి నిర్మాణానికి సంబంధించిన వివరాలు. ఆఫ్‌లైన్‌లో సమగ్రంగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లు జరిగినా లబ్ధిదారుడు నష్టపోవాల్సి వస్తుందన్నారు. తడి, పొడి చెత్తను సేకరించి వాటిని వేరు చేయాలని, డంపింగ్ యార్డుల్లో కంపోస్టు ఎరువులను తయారు చేయాలని అన్నారు. గ్రామాల్లోని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ద్వారా నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తారని తల్లిదండ్రులకు ఎలాంటి ఖర్చులు ఉండవని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ నర్రా వినోద, పీఏసీఎస్ డైరెక్టర్ నర్రా మోహన్‌రెడ్డి, ఎంపీడీవో ఎస్పీ. జయలక్ష్మి, ఎంఈవో సైదానాయక్, ఎంపీవో సత్యనారాయణ, ఏపీవో శ్రీలత, పరమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీడీపీ మండల కమిటీ ఎన్నిక



కట్టంగూరులో నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

కట్టంగూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కట్టంగూరు మండల నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నట్లు ఆ పార్టీ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి యాపాకుల అంజయ్య, భువనగిరి టీడీపీ పార్లమెంటరీ కార్యదర్శి నూకల శ్రీధర్‌రెడ్డిలు తెలిపారు. మండల అధ్యక్షుడిగా బూరుగు తిరుమల్లేష్, ఉపాధ్యక్షుడిగా సైదులు, మండల ప్రధాన కార్యదర్శి శ్రీపాద నందకుమార్, కార్యదర్శులుగా గోపగోని వెంకన్న, కడమంచి వెంకటేశం, సహాయ కార్యదర్శులుగా గాజుల భిక్షం, నిమ్మనగోటి యాదయ్య, కోశాధికారిగా నిమ్మనగోటి సత్యనారాయణలను ప్రకటించారు.

దివ్యాంగులను భవిత కేంద్రానికి పంపించాలి

మర్రిగూడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులైన పిల్లలను వారి తల్లిదండ్రులను భవిత కేంద్రంకు పంపించాలని మండల స్పెషల్ అధికారి వేణుగోపాలచారి అన్నారు. గురువారం పాఠశాలలు పునఃప్రారంభం సందర్భంగా మర్రిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఓ భవనంలో ఏర్పాటుచేసిన భవిత కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అంతకుముందు జడ్పీ ఉన్నత పాఠశాలలో పిల్లల తల్లిదండ్రులతో పిల్లల భవిష్యత్ గురించి ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించబడుతుందని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో ఎంఈవో బిట్టు శ్రీనివాస్, ఎంపీడీవో మున్నయ్య, ప్రధానోపాధ్యాయులు కల శ్రీనివాస్, పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

నార్కట్‌పల్లి : ప్రత్యేక అవసరాలు కావాల్సిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని భవిత కేంద్రం ఐఈఆర్‌పీలకు నార్కట్‌పల్లి మండల ప్రత్యేకాధికారి చరితారెడ్డి సూచించారు. అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా గురువారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ, భవిత కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేకావసరాలు కలిగిన భవిత కేంద్రం విద్యార్థులకు కలర్ పెన్సిల్స్, ఆట వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కత్తులోజు ఉమేశ్ చారి భవిత ఐఈఆర్‌పీలు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కనగల్, జూన్12 (ఆంధ్రజ్యోతి) అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని దర్వేశిపురం రేణుకాఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దర్వేశిపురం, పగిడిమర్రి, జంగమయ్యగూడెం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పండుగ వాతావరణంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున కేటాయిస్తుంద న్నారు. తొలి విడతలో ఇళ్లు మంజూరు కాని వారికి రెండో విడతలో ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు నిరంతరం జరిగే ప్రక్రియగా ఆయన వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్‌టీఏ మెంబర్ రాజురెడ్డి, మాజీ సర్పంచులు గోలి నర్సిరెడ్డి, ఇడుకుళ్ల రవీందర్, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.

మంత్రి శ్రీహరిని కలిసిన జనార్దన్



శాలిగౌరారం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడలు యువజన శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వాకిట శ్రీహరిని గురువారం హైదరాబాద్‌లో శాలిగౌరారం మండలం మాదారం గ్రామ మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకుడు నోముల జనార్దన్, కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు నోముల రవికుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

కొనసాగిన రెవెన్యూ సదస్సులు

చిట్యాలరూరల్ /కనగల్/ చిట్యాల /కట్టంగూరు జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పలు మండలాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు కనగల్ మండలం ఎస్‌లింగోటం, మైలారం, రేగట్టె సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలోడీటీ నర్రి పార్వతమ్మ ఆర్‌ఐ సునీత, ఎస్ఏ విఘ్నేశ్వర్‌రెడ్డి, ఏఆర్ఐ యాదయ్య, కార్యదర్శి నవీన్ తదితరులున్నారు. చిట్యాలలో జరిగిన రెవెన్యూ సదస్సులో డీటీ విజయ పాల్గొన్నారు.

కట్టంగూరు మండలం మునుకుంట్ల, దుగినెల్లి గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహించారు కార్యక్రమంలో ఆర్ ఐ కుమార్ రెడ్డి, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

ప్రచారం చేసే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నాంపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాల బీజేవైఎం మండలాధ్యక్షుడు నాంపల్లి సతీష్ కోరారు. గురువారం నాంపల్లిలో ఆయన మాట్లాడారు. పాఠశాలలపై చర్యలు తీసుకోకపోతే బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఆర్థిక సాయం

శాలిగౌరారం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుడిమిడి గ్రామంలో పేద కుటుంబానికి చెందిన శ్రీలోజు లింగాచారి ఇటీవల మరణించాడు. లింగా చారి కుమారుడు నర్సింహాచారికి రూ.35 వేలు గ్రామస్తులు అందజేశారు. అంద జేసిన వారిలో చెవుగాని శంకర్ గౌడ్, బండారు శేఖ ర్, బండి యాదగిరి ,కొడిమాల శంకర్, గడ్డం వీరయ్య పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు మద్దతు

నల్లగొండ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన సీపీఎం పట్టణ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నల్లగొండలో ఎఫ్‌సీఐ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించే నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కోరారు. సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు గుండాల నరేష్ అధ్యక్షతన జరిగన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాషం, సలీం, దండెంపల్లి సత్తయ్య, పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, కుంభం కృష్ణారెడ్డి, అద్దంకి నరసింహ, దండెంపల్లి సరోజ, కోట్ల అశోక్‌రెడ్డి, పిన్నపురెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : కార్మిక సంఘాలను ఆర్టీసీలోకి అనుమతించి, కార్మిక సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్ఆర్‌టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) నల్లగొండ రీజియన్ నాలుగో మహాసభ స్థానిక దొడ్డి కొమురయ్య భవన్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఆ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనేక సార్లు రవాణా శాఖ మంత్రికి, ఆర్టీసీ యాజమాన్యానికి వినతి పత్రాలను, ఆర్టీసీ యూనియన్లు సమర్పించి, అనేక రూపాల్లో ఆందోళనలు నిర్వహించాయన్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కాం గ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 2013 బాండ్ల డబ్బులు విడుదల చేయడం, 2017 వేతన సవరణ చేపట్టడాన్ని ఆర్టీసీ కార్మికులు గుర్తుంచుకుంటారని అన్నారు. సమస్యలపై సమ్మె దాకా వెళ్లొద్దని, రవాణా శాఖ మంత్రితో చర్చించమంటూ ముఖ్యమంత్రి చెప్పడం మంచిదేనని అన్నారు. అయితే సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చినప్పుడే యూనియన్లు, మేనేజ్‌మెంట్ కూర్చొబెట్టి చర్చిస్తే సమ్మె దాకా వెళ్లాల్సిన అవసరమే రాదని, సమ్మె చేయాలన్న కోరిక ఏ కార్మికులకు ఉండదని, స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారి కేఎస్‌రెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ జూన్ 21, 22 తేదీల్లో ఖమ్మంలో 4వ రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు ఎంపికైన ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపు నిచ్చారు. మహాసభలో రెం డేళ్ల నిర్వహించిన కార్యక్రమాలను రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్ కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, రీజియన్ అధ్యక్షుడు కందుల నరసింహ, రీజియన్ నాయకులు ఎంసీ మౌలి శ్యామ్ సుందర్, సీహెచ్ రేవతి, కృష్ణయ్య, గులామ్ రసూల్, రవి, రమేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

తక్కళ్లపహాడ్ మాజీ సర్పంచ్ భిక్షమయ్య నేత్రదానం




భిక్షమయ్య నేత్రాలను దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

శాలిగౌరారం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపహాడ్ గ్రామ మాజీ సర్పంచ్ వజ్జె భిక్షమయ్య (55) బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. నల్లగొండలోని డాక్టర్ సాయి లావణ్య కడిమి సూచన మేరకు భిక్షమయ్య కుటుంబ సభ్యులు అతడి నేత్రాలను దానం చేయడానికి అంగీకరించారు. వెంటనే రాత్రి 9గంటలకు లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్ ఐ డొనేషన్ సెం టర్ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ చిరు నోముల, డాక్టర్ అగర్వాల్, ఐ బ్యాంక్ టెక్నీషియన్ బచ్చలకూర జానీ భిక్షమయ్య భౌతికకాయం నుంచి నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఐ డోనేషన్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హరినాథ్ మాట్లాడుతూ కుటుంబ సభ్యుల్లో ఒకరు మృతిచెందడం ఎంతో బాధ కలిగించే విషయమని, కుటుంబమంతా తీవ్రమైన దుఃఖంలో ఉండి ఎ కూడా నేత్రదానం చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు.

ఎమ్మెల్యే సామేల్ పదవికి రాజీనామా చేయాలి

శాలిగౌరారం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన అంటూ ఎమ్మెల్యే మందుల సామెల్ పైసలు వసూళ్ల పాలన చేస్తున్నారని బీఆర్ఎస్వీ శాలిగౌరారం మండలం అధ్యక్షుడు మహేశ్వరం వెంకన్న అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లిక్కర్ వ్యాపారులను డబ్బులు ఇవ్వాలని బెదిరించి అడ్డంగా దొరికి ప్రశ్నించే వారి పైన కేసులు పెట్టడం సిగ్గుమాలిన చర్యన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావొస్తున్న నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని, గతంలో చేసిన అభివృద్ధి పనులకే కొబ్బరికాయ కొట్టి కాలం గడుపుతుండన్నారు. ఎన్నికల ముందు నీతులు చెప్పి ఎమ్మెల్యే గెలవగానే సొంత పార్టీ నాయకులను ఏజెంట్‌గా పెట్టుకొని దందాలు చేయడం సిగ్గుచేటు అని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్పుతారన్నారు. కమిషన్లు కాదు పాలనా మీద దృష్టి పెట్టి నియోజకవర్గం అభివృది కోసం పని చేయాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శుక్రవారం 13 జూన్ 2025



చికెన్ ధరలు	
లైవ్	124
డ్రెస్	184
స్కిన్‌లెస్	210
గుడ్డు డజన్	72
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	37.0
కనిష్ఠం	22.4

అంగన్‌వాడీల్లోనూ గంట కొట్టాల్సిందే

సీడీపీవోలకు ప్రిన్సిపల్ సెక్రటరీ మౌఖిక ఆదేశాలు

తొలిరోజు నార్కట్‌పల్లిలో ప్రారంభించిన కలెక్టర్ త్రిపాఠి 6

● స్వాగతం.. సుస్వాగతం



జిల్లా వ్యాప్తంగా గురువారం పాఠశాలలు తెరుచుకున్నాయి. నిడమనూరు ప్రాథమిక పాఠశాలను ఉపాధ్యాయులు మామిడి తోరణాలు, పూలతో అలంకరించి విద్యార్థులకు స్వాగతం పలికారు. 8

● ఇక్కత్ కళ అద్భుతం



పోచంపల్లిలో చేనేత వస్త్రాలు, జాతీయ జెండాను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

చేనేత అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ఇక్కడి పథకాలు ఉత్తరాదిలో అమలు చేసేందుకు కేంద్రంతో మాట్లాడతా
- కార్మికుల జీవన ప్రమాణాలు పెంపొందాలి
- అంతా చేనేతను ఆదరించాలి
- ఇక్కత్ డిజైన్ల చౌర్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా
- భూదాన్‌పోచంపల్లిలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

భూదాన్‌పోచంపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు పెరిగేందుకు, కార్మికుల అభ్యున్నతికి ప్రభుత్వం చేపట్టే పథకాలు ఉత్తర భారత రాష్ట్రాల్లోనూ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతానని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. భూదాన్‌పోచంపల్లి పట్టణంలో గవర్నర్ గురువారం పర్యటించి పట్టణంలోని చేనేత కార్మికులు భారత మధు, భారత భాస్కర్ ఇళ్లను సందర్శించి వారి జీవన తీరు తెన్నులను పరిశీలించారు. చేనేత మగ్గంపై వస్త్ర తయారీ ప్రక్రియలను పరిశీలించారు. అనంతరం పోచంపల్లి టూరిజం పార్కులో ఏర్పాటు చేసిన మ్యూజియంను పరిశీలించారు. చేనేత వస్త్ర తయారీ ప్రక్రియలు 'లీవ్‌టుక్లాత్' ప్రాసెసింగ్ యూనిట్ సందర్శించి ఏవీని వీక్షించారు. పోచంపల్లి రూరల్ టూరిజం సెంటర్ సందర్శించిన గవర్నర్‌కు చేనేత వస్త్ర ప్రక్రియల గురించి బోడ నవనీత, భారత లవకుమార్, దోర్నాల శేషగిరి, రుద్ర అంజనేయులు వివరించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం గోవర్ధన్‌తో పాటు చేనేత వస్త్ర విక్రయదారులు, అసోసియేషన్ ప్రతినిధులు, చేనేత కార్మికులు, చేనేత కళాకారులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మిగతా 6వ పేజీలో...

భారం మోయలేం!





- బిల్లులు ఇవ్వకపోతే విధులు నిర్వహించలేమంటున్న కార్యదర్శులు
- వానాకాలం పనులు చేయలేమని స్పష్టీకరణ
- భారీగా నిలిచిన బిల్లులతో కష్టమైన నిర్వహణ
- ఉమ్మడి జిల్లాకు నిలిచిన రూ.692.94కోట్ల ఆర్థిక సంఘం నిధులు
- డీఎస్ఆర్ యాప్‌పై మంత్రి సీతక్క హామీతో ఆందోళన విరమణ

గ్రామపంచాయతీల నిర్వహణ తలకుమించిన భారమైందని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. ఏడాదిన్నరగా పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో అప్పటి నుంచి కేంద్ర ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచాయి. ఈ నేపథ్యంలో అత్యవసర పనులన్నింటినీ కార్యదర్శులే వీడీసీల ద్వారా లేదా నామినేటెడ్ ఏజన్సీల ద్వారా చేయిస్తున్నారు. ట్రాక్టర్ల నిర్వహణకు డీజిల్ కొనుగోలు సైతం కార్యదర్శులే చేస్తున్నారు. దీంతో వారిపై మోయలేని భారం పడుతోంది.

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలనవచ్చాక నిధుల రాకడ నిలిచింది. అత్యవసరమైన తాగునీటిసరఫరా వంటి పనులకు ప్రత్యేక నిధులు మంజూరవుతున్నా, ఇతర పనులకు సంబంధించిన బిల్లులు భారీగా పేరుకుపోవడంతో పంచాయతీల నిర్వహణ భారంగా మారిందని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. ట్రాక్టర్ల నిర్వహణ తమవల్లకాదంటూ తాళాలను ఎంపీడీవో కార్యాలయాల్లో అప్పగిస్తున్న పరిస్థితి మొదలైంది. ఉమ్మడి జిల్లాలో 1,740 పంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొనగా, వర్షాకాలం సీజన్‌లో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ఇబ్బంది కలుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

చేతులెత్తేసిన కార్యదర్శులు

గ్రామపంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో అత్యవసర పనులను కార్యదర్శులు వీడీసీల ద్వారా చేయించారు. ప్రధానంగా తాగునీటి మోటర్ల మరమ్మతులు, పైప్‌లైన్ల ఏర్పాటు, వీధిదీపాల ఏర్పాటు, బ్లీచింగ్, శానిటేషన్ మెటీరియల్, ఫాగింగ్ లిక్విడ్ కొనుగోళ్లతో పాటు, ట్రాక్టర్లకు డీజిల్ సరఫరా బాధ్యత వీరిపైనే పడింది. ప్రత్యేకాధికారుల పాలన అమలులోకి వచ్చినప్పటి నుంచి ఏడాదిన్నరగా కార్యదర్శులే ఈ పనులు చేయిస్తున్నారు. అందుకు సంబంధించిన బిల్లులను గత ఏడాది జూలై వరకు ఒక దఫా, ఆ తర్వాత ఇటీవల మరో మూడు మాసాలకు సంబంధించిన కొంతమేర బిల్లులు మంజూరయ్యాయి. సుమారు ఏడాదికాలానికి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కార్యదర్శులకు వడ్డీల భారంతో పాటు, వీడీసీలు సైతం పనులు చేయకుండా పాత బిల్లుల కోసం ఒత్తిడి తెస్తున్నారు. పంచాయతీ ట్రాక్టర్లకు డీజిల్ సరఫరా చేసే పెట్రోల్ బంక్‌ల నిర్వాహకులు డీజిల్ ఇవ్వడం ఆపేశారు. దీంతో ట్రాక్టర్ల నిర్వహణ పూర్తిగా భారమైందని కార్యదర్శులు చెబుతున్నారు.

నిలిచిన కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధులు

ఉమ్మడి జిల్లాలో కేంద్ర 15వ ఆర్థిక సంఘం నుంచి నల్లగొండ జిల్లాకు ప్రతీ మూడు నెలలకు రూ.19.50కోట్లు వస్తే, యాదాద్రి జిల్లాకు రూ.11.24కోట్లు, సూర్యాపేట జిల్లాకు రూ. 13.25కోట్ల నిధులు వచ్చేవి. ప్రత్యేకాధికారుల పాలన వచ్చాక రెండు పర్యాయాలు ఈ నిధులు మంజూరైనా, అవి పాలకవర్గాల హయాంలో చేపట్టిన మిగతా 6వ పేజీలో...

● భారీగా పెండింగ్ బిల్లులు

ప్రత్యేకాధికారుల పాలన వచ్చిన 18 నెలల నుంచి వేసవిలో చేపట్టిన ప్రత్యేక పనులకు సంబంధించిన నిధులు మినహా ఇతర పనుల బిల్లులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శులు ట్రాక్టర్ల నిర్వహణ నిమిత్తం డీజిల్‌ను పంచాయతీ పేరున ప్రైవేట్ పెట్రోల్ బంకుల్లో అప్పుగా పోయించారు. ఈ బిల్లులు పేరుకపోవడంతో అప్పు పెరగ్గా, ఖాతాలు నిలిపివేయడంతో నిర్వహణ కుంటుపడింది. నల్లగొండ జిల్లాలో సుమారు రూ.35.40 కోట్లు, సూర్యాపేట జిల్లాలో రూ.31.30కోట్లు, యాదాద్రి జిల్లాలో రూ.19కోట్ల మేర పెండింగ్ బిల్లులు ఉన్నట్లు సమాచారం. కొన్ని పెద్ద పంచాయతీల్లో ఇంటిపన్నులు ఇతరత్రా స్థానిక వనరుల ద్వారా కొంత మేర గ్రాంట్లకు చెక్కులు మంజూరైనా అవి ట్రెజరీల్లో పాసవడం లేదని, దీంతో పెండింగ్ బిల్లుల మొత్తం భారీగా పెరుగుతోందని కార్యదర్శులు చెబుతున్నారు. గ్రాంట్లు మంజూరు చేయకపోతే వర్షాకాలంలో పంచాయతీల నిర్వహణ దుర్భరంగా ఉంటుందని, ప్రభుత్వం చొరవ తీసుకొని గ్రాంట్లు మంజూరు చేసి వానాకాలంలో బ్లీచింగ్, పారిశుధ్య పనులు సత్వరమే చేపట్టేందుకు సహకరించాలని కార్యదర్శులు కోరుతున్నారు.



● రైతు భరోసా ●

భూభారతి ఆధారంగా..

- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- రైతుల వివరాలు, ఖాతా నెంబర్లు పంపించాలని ఆదేశాలు
- ఆన్‌లైన్‌లో నమోదు కాని వివరాలు తిరిగి నమోదు
- ఈ నెల 5 వరకు పాస్‌బుక్ పొందిన వారికి సైతం సాయం
- ఉమ్మడి జిల్లాలో 11.56లక్షల మంది పట్టాదారులు
- పూర్తి సమాచారం పంపేందుకు వ్యవసాయశాఖ సన్నద్ధం

నల్లగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం భూభారతి పోర్టల్‌లో నమోదైన భూ విస్తీర్ణం, రైతుల వివరాల ఆధారంగానే రైతుభరోసా అందజేసేందుకు నిర్ణయించింది. వ్యవసాయయోగ్యం కాని భూములకు రైతుభరోసా పథకం వర్తించని విషయం తెలిసిందే. తాజాగా, ప్రభుత్వం రైతుభరోసాకు సంబంధించి మార్గదర్శకాలను, విధివిధానాలను వెల్లడించింది. వానాకాలం సీజన్‌లో రైతుభరోసాను ఎకరానికి రూ.6వేల చొప్పున ఏడాదికి రూ.12వేలు చెల్లించనుంది. అయితే ఎన్ని ఎకరాల వరకు రైతుభరోసా చెల్లిస్తామనే దానిపై ప్రభుత్వం వివరాలు వెల్లడించలేదు.

వానాకాలం సీజన్‌లో రైతులకు పెట్టుబడి సాయం ఎలా అందించాలి? గతంలో ఉన్న పొరపాట్లను ఎలా సరిదిద్దాలి? అనే అంశంపై రైతుల వివరాలు, ఖాతా నెంబర్లు తిరిగి పంపించాలని సూచిస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. పట్టాదారుల డేటాను సవివరంగా పంపేలా చూడాలని స్పష్టం చేసింది. ఆర్‌బీఐ డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ప్లాట్‌ఫాం మిగతా 7వ పేజీలో...

సాగర్ క్రస్ట్ గేట్ల ట్రయల్ రన్

● రూ.10లక్షలతో క్రస్ట్ గేట్లకు మరమ్మతులు పూర్తి 7

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



నల్లగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా దళిత సంక్షేమం, ఎస్సీ, మైనార్టీ సంక్షేమశాఖల మంత్రి అడ్లూరు లక్ష్మణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కే.రామకృష్ణారావు జీవో నెం.133 విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి దాదాపు ఏడాదిన్నరపాటు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరించగా, తాజా మార్పులు, చేర్పుల నేపథ్యంలో ఆయన్ను కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించారు. కొత్తగా మంత్రి పదవి చేపట్టిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను నల్లగొండకు నియమించారు. ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులను, అధికారయంత్రాంగాన్ని సమన్వయం చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిపనులపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి, సక్రమంగా అమలయ్యేలా ఇన్‌చార్జి మంత్రులు బాధ్యత వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోన్న ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్‌యువవికాసం లబ్ధిదారుల ఎంపికలో వీరి పాత్ర క్రియాశీలకంగా ఉంటుంది. తొలిసారి మంత్రి అయిన లక్ష్మణ్‌కుమార్ కీలకమైన నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులవడం విశేషం.

రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి వద్దు

- కాంగ్రెస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి



నల్లగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తాను నిత్యం నల్లగొండ ప్రజలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు అందుబాటులో ఉండే వ్యక్తినని, తనకు రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి ఇస్తే న్యాయం చేయలేనని, అవకాశం ఉంటే డీసీసీ అధ్యక్ష పదవిని ఇవ్వాలని కాంగ్రెస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి ఇస్తే అందరిని కలుపుకొని పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని అన్నారు. పదవి ఉన్నా, లేకున్నా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నాయకత్వంలో పనిచేస్తానన్నారు. కొంతమంది కావాలని సోషల్ మీడియాలో తాను కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రచారం చేయడాన్ని ఖండించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గుమ్ముల ఏళ్లుగా పార్టీ బలోపేతం కోసం కృషి చేశారని, ఆయనకు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వడం సమంజసమన్నారు. సమావేశంలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కత్తుల కోటి, జూలకంటి వెంకట్‌రెడ్డి, మామిడి కార్తీక్, గాలి నాగరాజు, జూలకంటి శ్రీనివాస్, జహంగీర్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం గర్వించేలా అభివృద్ధి

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎంపీ ఈటల రాజేందర్

నల్లగొండ టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ పాలనలో దేశం 11 ఏళ్లలో అనేక రంగాల్లో అసాధారణ పురోగతి సాధించిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు పద్మానగర్‌లో చేనేత కార్మికులతో మాట్లాడి హనుమాన్‌నగర్ దేవాలయం వద్ద మొక్క నాటారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన 11 ఏళ్ల సుపరిపాలన ఛాయాచిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వంపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదని, ఇది దేశ ప్రజల నమ్మకానికి నిదర్శనమన్నారు. రైతులు, యువత, మహిళలు ఈ నాలుగు ప్రధాన విభాగాల అభివృద్ధి కోసమే ప్రతీ కార్యక్రమ రూపకల్పన చేశారని అన్నారు. పన్నుల వ్యవస్థలో సమగ్ర మార్పులు చేసి, జీఎస్టీ ద్వారా వన్ నేషన్ వన్ ట్యాక్స్ లక్ష్యాన్ని సాధించామన్నారు. 2014లో 6.91 కోట్ల మంది పన్నులు కట్టే వారు ఉండగా, ఇప్పుడు 15.66 కోట్లకు పెరిగారని వివరించారు. ఇలా అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి చెందుతోందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, నాయకులు సునీతారెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, పిల్లి రామరాజు, పల్లెబోయిన శ్యామ్ సుందర్, వీరెల్లి చంద్రశేఖర్, కన్మంత రెడ్డి శ్రీదేవిరెడ్డి, కంకణాల నివేదితరెడ్డి, దోనూర్ వీరారెడ్డి, పోతేపాక లింగస్వామి, పాలకూరి రవిగౌడ్, కర్నాటి సురేష్, లాలునాయక్, చింతా ముత్యాల్‌రావు, కొండేటి సరిత, లకడపురం వెంకటేశ్వర్లు, రావెల కాశమ్మ, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్, పాల్గొన్న నాగం వర్షిత్‌రెడ్డి

● ఈటలకు నార్కట్‌పల్లిలో ఘన స్వాగతం

నార్కట్‌పల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో జరిగిన పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు మార్గమధ్యలో నార్కట్‌పల్లి వద్ద బీజేపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈటలకు స్వాగతం పలికిన వారిలో బీజేవైఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పజ్జూరి వెంకట్‌రెడ్డి, పాల్వాయి భాస్కర్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్, కొరివి శంకర్, నడింపల్లి శ్రవణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక ఆదాయం : అనంతరెడ్డి

గుర్రంపోడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పాం సాగుతో సుస్థిరమైన ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి అనంతరెడ్డి అన్నారు. గురువారం గుర్రంపోడు గ్రామంలో రైతు చందా వెంకట్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో మెగా ఆయిల్‌పాం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ప్రభుత్వం అందించే డ్రిప్ పొంది పెద్దఎత్తున ఆయిల్‌పాం సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఉద్యానవన అధికారి మురళి, ఏవో మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు షేక్ సయ్యద్‌మియా, కుప్ప అమరేందర్‌గౌడ్, పగిళ్ల లాలయ్య, రైతులు ఉన్నారు.



ఆయిల్‌పాం మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అనంతరెడ్డి

భవిత కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు



పెంపుడు శునకాన్ని పిల్లలకు చూపించి, ఏం పేరు పెడదామంటూ సరదాగా దివ్యాంగ విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

గుర్రంపోడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థుల కోసం భవిత కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని భవిత విద్యావనరుల కేంద్రాన్ని ఆమె ప్రారంభించి, విద్యార్థులతో సరదాగా గడిపారు. ఒక్కో విద్యార్థి పేరు అడిగి తెలుసుకున్నారు. రెండు పెంపుడు శునకాలను తెప్పించి పిల్లలు వారితో ఆడుకుంటూ ఉత్సాహంగా ఉండటాన్ని గమనించి ఏం పేరు పెడతారని పిల్లలను ప్రశ్నించారు. మ్యాంగో పేరు పెడుతున్నామని తెలిపారు. ప్రతీవారం భవిత కేంద్రాన్ని సందర్శిస్తానని, ఇక్కడికి వచ్చేప్పుడు పెంపుడు శునకాన్ని తీసుకువస్తానని విద్యార్థులకు తెలిపారు. గుర్రంపోడు భవిత కేంద్రానికి తానే ఇన్‌చార్జినని, కేంద్రానికి విద్యార్థులు వచ్చేట్లు చూడాలని ఐఈఆర్‌టీ శారదకు సూచించారు. అంతకుముందు మోడల్ స్కూల్‌కు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించి పాఠ్యపుస్తకాలు అందజేశారు. కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీచేసి వసతులు బాగున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఏఎమ్మార్పీ డివిజన్ కార్యాలయానికి వెళ్లి నీటిపారుదల శాఖకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోచంపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మంజుల, ఎంఈవో నోముల యాదగిరి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రాగిణి, కేజీబీవీఎస్‌వో విజయశ్రీ, ఆర్ఐ నజీర్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి: డీఈవో

హాలియా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డీఈవో భిక్షపతి అన్నారు. గురువారం హాలియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన, క్రమశిక్షణ కలిగిన విద్య అందుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అంతకుముందు అనుముల, హాలియా, కొత్తపల్లి పాఠశాలలను తనిఖీచేశారు. కార్యక్రమంలో ఎంఈవో గుండా కృష్ణమూర్తి, మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, హైమావతి, శైలజ, సైదులు, పాల్గొన్నారు.

నారుమళ్ల తయారీలో మేళకువలు పాటించాలి

● ధీరావత్ సైదానాయక్, ఇన్‌చార్జి ఏడీఏ



ఇంటర్వ్యూ Interview

వానాకాలం సీజన్ ప్రారంభమైనందున రైతాంగం వరి నారుమళ్ల తయారు చేసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ దశలో రైతులు కొన్ని మేళకువలను పాటించడంతో నారుమళ్లు ఆరోగ్యంగా ఎదుగుతాయని ఇన్‌చార్జి ఏడీఏ ధీరావత్ సైదానాయక్ 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూలో తెలిపారు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ అర్బన్)

ఆంధ్రజ్యోతి : డివిజన్ పరిధిలో వానాకాలం వరిసాగు విస్తీర్ణం ఏస్థాయిలో ఉండబోతుంది..?

ఏడీఏ : వానాకాలం సీజన్‌లో 1.35 లక్షల ఎకరాల్లో వరిసాగయ్యే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో అత్యధికంగా సన్నాల సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. సాగు విస్తీర్ణానికి అనుగుణంగా అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. డివిజన్ పరిధిలో 90,186 మంది రైతులుండగా, ఇప్పటి వరకు 11.250 మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారు. మిగతా రైతులు కూడా అందుబాటులో ఉన్న ఏఈవోలను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరుతున్నాం.

ఆంధ్రజ్యోతి: వరినారుమళ్ల తయారీలో రైతులు పాటించాల్సిన కనీస జాగ్రత్తలేమిటీ..?

ఏడీఏ : రైతులు విత్తనశుద్ధికి ప్రాదాన్యతనివ్వాలి. కిలో ధాన్యానికి గ్రామ్ కార్బండిజమ్ చొప్పున మండెకట్టేందుకు ఉపయోగించే విత్తన పరిమాణం మేరకు నీటిలో కలిపి నానపోయాలి. ఈ ప్రక్రియతో విత్తనశుద్ధి జరిగి నారుమడిని చీడపీడలు ఆశించే అవకాశం సన్నగిల్లుతుంది.

ఆంధ్రజ్యోతి: నారుమళ్ల తయారీకి అనువైన సమయం ఏమిటీ..?

ఏడీఏ : తక్కువ పంటకాల పరిమితి కలిగిన విత్తనాలైతే జూలై 15లోపు, దీర్ఘకాలిక విత్తనాలైతే జూన్ 10 నుంచి 15 మధ్యలో నారుమళ్ల తయారు చేసుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది. ఎత్తైన మడిలో నారుమడి ఏర్పాటు చేసుకోవడం శ్రేయస్కరంగా ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: పచ్చిరొట్టతో ప్రయోజనాలు ఏమిటి..?

ఏడీఏ : పచ్చిరొట్ట వేసుకోవడంతో భూసార సమతుల్యత పెరిగి పంట దిగుబడుల్లో మార్పులు జరుగుతాయి. ప్రస్తుతం స్వల్పకాలిక, దీర్ఘకాలిక పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ పీఏసీఎస్‌ల్లో అందుబాటులో ఉన్నాయి. వరినారు నాటేందుకు 45 రోజుల ముందుగా పచ్చిరొట్టవిత్తనాలు జల్లుకోని పూత దశలో దమ్ముచేసుకోవడంతో పచ్చిరొట్ట ఎరువు తయారవుతుంది.

ఆంధ్రజ్యోతి: నారుమడిలో రెక్కలపురుగు లేదా కాండ తొలుచు పురుగు కనిపిస్తే ఎలాంటి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి..?

ఏడీఏ : రెక్కల పురుగు లేదా కాండం తొలుచుపురుగు కనిపిస్తే వెంటనే సమస్య రక్షణ చర్యలు చేపట్టాలి. అందుకు ఎకరం విస్తీర్ణంలో నాటే నారుమడికి కిలో కార్బోఫిరాన్ 3జీ గుళికలు వాడడంతో కీటక నాశిని జరగడంతో వేరువ్యవస్థ బలపడుతుంది.

సర్వీస్ రోడ్డుపై అడుగుకో గుంత

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు ● పట్టించుకోని ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులు

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ అర్బన్): మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేట ఫ్లై ఓవర్ వంతెనకు ఇరువైపులా నిర్మించిన సర్వీస్‌రోడ్డు అస్తవ్య స్తంగా తయారైంది. రోడ్డుపై అడుగుకో గుంత ఏర్పడడంతో వాహనదారులు రాకపోకల్లో ఇబ్బందులు పడుతున్నారు. సాగర్ రోడ్డు మీదుగా వచ్చే వాహనదారులు ఇందిరమ్మకాలనీతోపాటు ప్రకాష్‌నగర్, కృష్ణాకాలనీ, చింతపల్లి, మందులవారికాలనీ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు సర్వీస్‌రోడ్డు మార్గం నుంచి బైపాస్‌రోడ్డుపైకి చేరుకోవాల్సి ఉంటుంది. దీంతో ఈ రోడ్డుపై వాహనాల తాకిడి అధికంగానే ఉం టుంది. పట్టణంలోని దుకాణ సముదాయాలకు అవసరమయ్యే సరుకులు, గృహనిర్మాణ సామాగ్రి తదితరాలను చేరవేసేందుకు భారీవాహనాలు సైతం రోడ్డుపై నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వాహనాల రాకపోకలు అధికం కావడంతో రెండేళ్ల క్రితమే సర్వీస్ రోడ్డు దెబ్బతింది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఏదో ఒక సందర్భంలో ఈ రోడ్డుమార్గంలో వెళ్తూ తలెత్తే ఇబ్బందులను ప్రత్యక్షంగా చూస్తున్నప్పటికీ పట్టించుకోవడంతో నిర్లక్ష్యం చూపుతున్నారు. కొన్ని సందర్భాల్లో రోడ్డుపై ఏర్పడ్డ భారీ గుంతలను తప్పి ంచే క్రమంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు లోనవుతున్నాయి. రోడ్డుమార్గాన్ని బాగు చేయాలంటూ అధికారులకు విన్నవిస్తున్నప్పటికీ అంతగా పట్టించుకోవడం లేదంటూ స్థానికులు వాపోతున్నారు.



హనుమాన్‌పేట ఫ్లై ఓవర్ దిగువన దెబ్బతిన్న సర్వీస్‌రోడ్డు

మరమ్మతులు చేపట్టాలి

వర్షాకాలం ప్రారంభమైనందున వానలు కురిస్తే రోడ్డుపై ఏర్పడ్డ గుంతల్లో వరదనీరు నిలిచి ప్రమాదాలు జరి గే అవకాశం ఉంది. మరోవైపు ఫ్లై ఓవర్ వంతెన దిగవ భాగంలోని పిల్లర్ల దిగువన ఉన్న ఖాళీ ప్రదేశాల్లో మినీ మార్కెట్ ఏర్పాటు చేసే యోచనలో మునిసిపల్ అధికారులు ఉన్నారు. అదే జరిగితే సర్వీస్‌రోడ్డు మార్గంలో జనసంచారంతోపాటు వాహనాల రాకపోకలు మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది.



సర్వీస్ రోడ్డుపై పడిన గుంత

దీంతో రోడ్డుకు ప్రాధాన్యత ఏర్పడనున్న నేపథ్యంలో మునిసిపల్, రోడ్డు భవనాలశాఖల అధికారులు సమిష్టి చర్యలకు చేపట్టి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతుల కోసం చర్యలు తీసుకుంటాం



సర్వీస్‌రోడ్డు మరమ్మతుల కోసం తగు చర్యలు తీసుకుంటాం. ప్రజల నుంచి ఫిర్యాదులను పరిగణలోకి తీసుకొని ప్రతిపాదన కోసం అర్అండ్‌బీ అధికారులను సంప్రదించే ప్రయత్నం చేస్తాం. ఫ్లై ఓవర్ వంతెన దిగువలో మినీ మార్కెట్ ఏ ర్పాటుతో ఈ రోడ్డు అవసరం పెరుగుతుంది. కాబట్టి సాధ్యమైనంత త్వరలో మరమ్మతులు చేపట్టేందుకు కృషి చేస్తాం.

- ఎండీ యూసుఫ్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ

రాత్రి వేళల్లో ఇబ్బంది పడుతున్నాం



ఫ్లై ఓవర్ వంతెనకు ఇరువైపులా నిర్మించిన సర్వీస్‌రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. రోడ్డుపై వెళ్లాలంటే భయపడాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో మరింతగా ఇబ్బందిపడుతున్నాం. సమస్య పరిష్కరించడంతో ఆర్అండ్‌బీ, మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే చొరవతీసుకొని రోడ్డు మరమ్మతులకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. ప్రజల ఇబ్బందులను అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించాలి.

-అజయ్ (మిర్యాలగూడ)

సమన్వయంతో పనిచేయాలి

మిర్యాలగూడటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలని మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. పట్టణంలో నిర్వహిస్తున్న వంద రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పచ్చదనం పెంచాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని వార్డు ఆఫీసర్లకు సూచించారు. అధికారులు పాల్గొన్నారు.

భూసేకరణకు రైతులు సహకరించాలి

చింతపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు నిర్మాణ పనులకు భూసేకరణకు భూములు అందించి రైతులు సహకరించాలని ఆర్డీవో రమణారెడ్డి తెలిపారు.ఃమండలంలోని వర్కాల గ్రామంలోని సర్వేనంబర్ 173లో భూములు ఇచ్చిన రైతులతో గురువారం మాట్లాడారు. ప్రాజెక్టు పనుల్లో భూములు కోల్పోయిన రైతులందరికీ ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా నష్టపరిహారం అందించుటకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట చింతపల్లి తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, ఆర్ఐ సునీత పాల్గొన్నారు.

72 కోతుల పట్టివేత

దేవరకొండ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో మునిసిపల్‌శాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోనులో 72 కోతులు చిక్కినటు శానిటరి ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్ గురువారం తెలిపారు. కోతుల బెడదను నివారణకు నెల్లూరు నుంచి కోతులను పట్టేవారిని రప్పించి వివిధ కాలనీల్లో మూడు బోన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 72 కోతులు పట్టు బడగా వాటిని శ్రీశైలం అడవులలో వదిలిపెడుతున్నట్లు తెలిపారు.

వీర్లపాలెంలో ఏరువాక.. పాల్గొన్న ఎమ్మెల్యే



ఏరువాకలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

దామరచర్ల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీర్లపాలెం గ్రామంలో గురువారం నిర్వహించిన ఏరువాక కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గూడులేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

● ఎమ్మెల్యే బాలునాయక్ ● దేవరకొండ మండలం సూర్యతండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

దేవరకొండ, జూన్ 12(ఆంధ్రజ్యోతి) : గూడు లేని పేదలందరికీ కాంగ్రెస్ ప్రభు త్వ ఇందిరమ్మ ఇంటిని మం జూరు చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని సూర్యతండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపనచేసి మాట్లాడారు. నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తున్నట్లు తెలిపారు. దేవరకొండ నియోజకవర్గంలో మొదటి విడతగా 3,500 ఇళ్లు పేదలకు మంజూరైనట్లు తెలిపారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో నిర్మించుకోవాలని కోరారు. అనంతరం దేవరకొండ పట్టణంలోని 10వ వార్డు అయ్యప్ప కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం దేవరకొండ పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, నోట్‌బుక్స్ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కమిషనర్ సుదర్శన్, ఎంఈవో మాతృనాయక్, దేవరకొండ ఎంపీడీవో దాని యెల్ నాయకులు సిరాజ్‌ఖాన్, కొర్ర రవి, మోతీలాల్, శిరందాసు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలు నాయక్

పెంచిన బస్‌పాస్ చార్జీలు తగ్గించాలి : పీఎస్‌యూ

మిర్యాలగూడ టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల పెంచిన బస్ పాస్ చార్జీలు తగ్గించాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్(పీఎస్‌యూ) ఆధ్వర్యంలో ఆర్టీసీ అధికారికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కన్వీనర్ వంశీ విలేకరులతో మాట్లాడారు. బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులందరూ మధ్యతరగతి, పేద కుటుంబాలకు చెందిన వారేనన్నారు. గ్రామాలు, తండాల నుంచి విద్యనభ్యసించేందుకు బస్సుల్లో వచ్చే వారిపై ఆర్థికభారం మోపితే వారందరూ చదువుకు దూరమయ్యే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో కోకన్వీనర్ అజయ్, రవిశంకర్, అరుణ్ పాల్గొన్నారు.

విద్య, రవాణా ఉచితంగా అందించాలి..

కేజీ టు పీజీ విద్య, విద్యార్థులందరికీ ఉచిత రవాణా కల్పించాలని ఆప్ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు కీర్తి అశోక్ కోరారు. దేశ భవిష్యత్ విద్యార్థుల పైనే ఉందని, నేటి విద్యార్థులను రేపటి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఉచిత విద్య అందించడంతో పాటు ఉచిత రవాణా కల్పించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

పెద్దవూర, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో, సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైనభోజనాన్ని అందించాలని ఏటీడీవో శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల, ఎస్టీ రెగ్యులర్ హాస్టల్, చలకుర్తి స్పెషల్ హాస్టళ్లను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయుల, విద్యార్థుల హాస్టల్ సిబ్బంది హాజరు పట్టికను, వంటగది, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. వర్షాకాలంలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని, పాఠశాల, హాస్టల్ ఆవరణలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలాజీనాయక్, వార్డె న్లు కొల్లు బాలకృష్ణ, సుధాకర్, ఉపాధ్యాయులు రాంరెడ్డి, కృష్ణ, షబ్బీర్, సైదులు, సంధ్య, షాహీన్, శాంతి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఏటీడీవో శ్రీనివాసులు

ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తేవాలి

మిర్యాలగూడ టౌన్, దామరచర్ల జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభు త్వ బడులకు పూర్వవైభవం తేవాలని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల, దామరచర్ల మండలం వాడపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వారు పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల ప్రారంభ రోజునే విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు అందించడం గతంలో జరిగేది కాదన్నారు. బడిబాటలో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో బాలు, అధికారులు వెంకటరెడ్డి, రాజు, దామరచర్ల మండల ప్రత్యేకాధికారి జూలకంటి వెంకట్‌రెడ్డి, ఎంఈవో బాలాజీనాయక్, ప్రధానోపాధ్యాయులు కోల శ్రీనివాస్, బండ వెంకట్‌రెడ్డి, నాయకులు సిద్ధయ్య, సత్యనారాయణ, పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్ : బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం సాగర్ పైలాన్ కాలనీలో శ్రీ వే మూరి అబిరామేశ్వర్ రావు ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. అలాగే విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యా పుస్తకాలు అందజేశారు. హెచ్‌ఎం శేషు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గుడిపల్లి(పెద్దఅడిశర్లపల్లి) : మండలకేంద్రంలోని మండల పరిషత్, జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు గురువారం స్పెషల్ ఆఫీసర్ నివేదిత, ఎంపీడీవో పద్మ, ఎంఈవో సముద్రాల శ్రీనయ్య, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలలు పాఠ్యపుస్తకాలు ఆయా ప్రదానోపాధ్యాయులు పంపిణీ చేసినట్లు ఎంఈవో తెలిపారు.

● తిరుమలగిరి(సాగర్) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా అందరూ కృషి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ ఎస్.శారదా తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా బడిబాటలో భాగంగా నిర్వహించిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు యూని ఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేశారు. అనంతరం భవిత సెంటర్‌ను సందర్శించి సౌకర్యాలను పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి చేశారు. కార్యక్రమంలో ఎంఈవో కె.శ్రీనివాస్ ఎంపీడీవో మల్లేశ్వర్, ఎంపీవో భిక్షంరాజు, ఆదర్శ కమిటీ చైర్మన్ రజిత,ఆలయ కమిటీ చైర్మన్ శాగం నాగిరెడ్డి, సైదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నిడమనూరు : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభమయ్యాయి. పాఠశాలలను మామిడి తోరణాలు, పూలతో అలంకరించి పండుగ వాతావరణంలో పాఠశాలలను తెరిచారు. విద్యార్థులు సైతం ఉల్లాసంగా పాఠశాలలకు హాజరయ్యారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా తొలిరోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు చెరుపల్లి వెంకటేశం, భారతమ్మ దంపతుల జ్ఞాపకార్థం రూ.15 వేల వ్యయంతో కొండా దివ్య, వినోద్ దంపతుల సహకారంతో ఏర్పాటు చేసిన నేమ్‌బోర్డును ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కృష్ణవేణి, ఎంపీడీవో గుర్రం వెంకటేశం, మండల విద్యాధికారి లావూరి వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, హెచ్‌ఎం చంద్రకళ, కర్నాటి శ్రీనుకుమార్, ఝాన్సీ, పూర్ణిమ పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంఈవో నాగేశ్వర్‌రావునాయక్ చేతుల మీదుగా యూనిఫామ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కట్ట బోయిన శ్రీనివాస్, నజీరుద్దీన్, యాదగిరి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చింతపల్లి : పాఠశాలలు పునః ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందించారు. మాల్, కుర్మేడ్ జడ్పీ హెచ్‌ఎంలు కృష్ణవేణి అనంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు ఉపాధ్యాయులు ఎండీ అన్వర్, వలీ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.



మిర్యాలగూడలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎంఈవో బాలు తదితరులు



చింతపల్లి : వీ.టీ.నగర్ జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీలో ఉపాధ్యాయులు

పొలంబాట పట్టిన ఉపాధ్యాయులు

డిండి : ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటూ ఉపాధ్యాయులు గురువారం పొలంబాట పట్టారు. మండలంలోని కొత్తతండా ప్రాథమిక పాఠశాలలో గత విద్యా సంవత్సరం నలుగురు ఉపాధ్యాయులు, పది మంది పిల్ల లు మాత్రమే ఉండేవారు. ఇక్కడ పని చేసే ఇద్దరు ఉపాధ్యాయులను ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేశారు. ఉపాధ్యాయుల సంఖ్యకు అనుగుణంగా విద్యార్థులు లేకపోవడంతో పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ప్రమీల, ఉపాధ్యాయులు బాలరాజు, అయోధ్య, ప్రియాంక గురువారం పొలం పనుల్లో నిమగ్నమైన పిల్లల తల్లిదండ్రుల వద్దకు వెళ్లారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అభ్యర్థించారు. గ్రామంలో బడిఈడు పిల్లల వివరాలు సేకరించిన ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగారు. అలాగే తల్లిదండ్రులతో కలిసి పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రుల వద్దకు వెళ్లి పిల్లలను తండాలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

వేతన బకాయిలు చెల్లించడం హర్షణీయం

మిర్యాలగూడ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల పెంచిన వేతన బకాయిలను చెల్లించడం హర్షణీయమని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ పోరాట ఫలితంగా అధికారులు కార్మికులకు వేతన బకాయిలు మంజూరు చేశారని తెలిపారు. మల్లు గౌతంరెడ్డి, తిరుపతి రాంమూర్తి, పాపిరెడ్డి, రామచంద్ర, వెంకన్న ఉన్నారు

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

కొండమల్లేపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి అమలులో భాగంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు మొ త్తం 199 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ ప్రశాంత్, ఆర్ఐ శ్రీనివాస్, ఐశ్వర్య పాల్గొన్నారు.

● పెద్దవూర : మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లు, విస్తీర్ణ సవరణలు, వారసత్వ పట్టాలు, పాస్‌పుస్తకాల్లో ఉన్న తప్పులను సవరించుకునేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ హబీబ్, సిబ్బంది జనార్ధన్, మౌనిక, రజిని, బాబు, రాజేష్, గ్రామస్థులు వర్ర సైదిరెడ్డి, గుంటుక సైదిరెడ్డి, కర్న రామాంజిరెడ్డి, సైదిరెడ్డి, పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో రమణారెడ్డి

ఆయిల్‌పాం సాగుకు ప్రోత్సాహం

పెద్దఅడిశర్లపల్లి,జూన్12(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పాం సాగుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోందని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ జిల్లా మేనేజర్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. గుడిపల్లి మండలం చిలకమర్రి గ్రామంలో గురువారం ఉద్యానశాఖ సహకారంతో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆయిల్‌పాం తోటల్లో మొదటి మూడేళ్ల వరి తప్ప మిగతా పత్తి, మొక్కజొన్న, కూరగాయలు అంతర పంటగా వేసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఉద్యాన అధికారి రవినాయక్, ఎ. ప్రకాశ్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, గోపాల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సామెతలతో హితబోధ పుస్తకావిష్కరణ

మిర్యాలగూడ టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత, విద్యావేత్త వారణాసి ఆంజనేయులు సామెతలతో రాసిన హితబోధ శతక పుస్తకావిష్కరణ గురువారం వరసిద్ధి వినాయకాలయంలో జరిగింది. కార్యక్రమానికి హాజరైన అష్టావధాని కాటేపల్లి లక్ష్మీనరసింహమూర్తి, నాటక సమాజాల సమాఖ్య వ్యవస్థాపకుడు తడకమళ్ల రాంచందర్‌రావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలోని నీతి, హితబోధ, జ్ఞానాలను ఉపయోగిస్తూ పుస్తకం రాయ డం గొప్ప విషయమన్నారు. మిర్యాలగూడ పట్టణంకళాకారులు, రచయితలకు పుట్టినిల్లు లాంటిదన్నారు. కార్యక్రమంలో కళాకారులు పులి కృష్ణమూర్తి పుల్లాభట్ల లక్ష్మీనారాయణశర్మ, వారణాసి కోటేశ్వరశర్మ, శ్రీధరశర్మ, నందికొండ చంద్రయ్య, అక్కినర్సయ్య, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : భైరవం / వెంకటేశ్వర: భగ్ లైఫ్ / రాఘవ: బద్మాషులు, శ్రీశ్రీశ్రీ రాజావారు / విట్రోస్: భగ్‌లైఫ్, భైరవం, దేవరకొండ : మనోజ్ : భైరవం / మైత్రి వెంకటేశ్వర : కరాటే కిడ్